


కేంద్ర ప్రభుత్వం మెమో నెం.57కు
అనుగుణంగా జి.ఓ. నెం.53 జారీ చేసి
పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించిన
ముఖ్యమంత్రి చంద్రబాబు
నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం...
ఉద్యోగుల రెండు దశాబ్దాల ఆకాంక్షను
నెరవేర్చి ఉద్యోగుల సంక్షేమంపై తన
నిబద్ధతను చాటుకుంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



సోమవారం 27.07.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 96 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# సంజీవనితో ఆరోగ్యాంధ్రకు శ్రీకారం

- ఆగస్టు నుంచే రాష్ట్రవ్యాప్తంగా అమలు
- ప్రతి కుటుంబానికి డిజిటల్ ఆరోగ్య భద్రత
- ఆలూరులో సీఎం చంద్రబాబు ప్రకటనలు
- మహిళలకు రూ.197 కోట్ల ఆర్థిక చేయూత
- ఏఐ, టెలీమెడిసిన్‌తో ఆధునిక వైద్య సేవలకు నాంది



**ఆలూరు, కర్నూలు జిల్లా (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రతను ప్రభుత్వ బాధ్యతగా తీసుకుంటూ ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర డిజిటల్ ఆరోగ్య వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కర్నూలు జిల్లా ఆలూరులో స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ. 197 కోట్ల ఆర్థిక సహాయ చెక్కును పంపిణీ చేసిన అనంతరం, 'సంజీవని' కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన విస్తృతంగా ప్రసంగించారు.

సీఎం మాట్లాడుతూ, "సీఎం అంటే సచివాలయంలో కూర్చునే చీఫ్ మినిస్టర్ మాత్రమే కాదు... ప్రజల మధ్య ఉండే కామన్ మ్యాన్ కూడా" అనే తన నమ్మకంతోనే నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటున్నానని చెప్పారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి అవసరాలకు అనుగుణంగా ప్రజా విధానాలు రూపొందిస్తున్నామని, అందుకే ప్రతి నెల జిల్లాల పర్యటనలు చేపట్టి 'సంజీవని' వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

**ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు :** ఆగస్టు నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టు అమలు ప్రారంభమవుతుందని సీఎం ప్రకటించారు. ప్రతి కుటుంబం విద్య, వైద్యంపై భారీగా ఖర్చు చేయాల్సిన పరిస్థితిని తగ్గించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. ఆరోగ్యవంతమైన కుటుంబం, ఆరోగ్యవంతమైన గ్రామం, ఆరోగ్యవంతమైన రాష్ట్రం అనే లక్ష్యంతో "ఆరోగ్య ఆంధ్రప్రదేశ్" నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

సంజీవని ద్వారా ప్రజల వ్యక్తిగత ఆరోగ్య రికార్డులను డిజిటల్ రూపంలో నమోదు చేసి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి ఆసుపత్రుల వరకు ఒకే ఆరోగ్య సమాచార వ్యవస్థను అనుసంధానం చేయనున్నట్లు వివరించారు.

**80 లక్షల మందికి ఆరోగ్య భద్రత లక్ష్యం :** రాష్ట్రంలో దాదాపు 80 లక్షల మంది తీవ్ర వ్యాధుల బారిన పడినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. అందుకే ప్రతి వ్యక్తికి ప్రత్యేక హెల్త్ ప్రొఫైల్, ప్రతి కుటుంబానికి ఆభా హెల్త్ ఐడీ, అలాగే హెల్త్ ఎక్స్ యాప్

మిగతా 2లో...






## వరదలపై డిజిటల్ నిఘా



- ఏఐతో ముందస్తు హెచ్చరికలు.. హాట్‌స్పాట్‌ల గుర్తింపు
- ఆర్టీజీఎస్-ఏపీఎస్‌డీఎంఏ సంయుక్త వ్యవస్థ
- ముందుగా విజయవాడలో అమలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** బుడమేరు... విజయవాడ నగరానికి నిత్యం పొంచిఉన్న వరదముప్పు ఇది. ఎప్పుడు ఆకస్మిక వరదలతో నగరంపై విరుచుకుపడుతుందో తెలీని ప్రమాదకరమైన వాగు బుడమేరు. వరద ముప్పు నుంచి విజయవాడ నగరానికి శాశ్వత అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం పలురకాల ప్రయత్నాలు చేస్తోంది. ఈ నగరమే కాదు ఇప్పుడు మారుతున్న వాతారవణ మార్పుల ప్రభావంతో పట్టణ ప్రాంతాల్లో వరదల ముప్పు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో విపత్తులు సంభవించే ముందే వాటిని అంచనా వేసి, ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం "సిటీ ఫ్లడ్ అలర్ట్" అనే సాంకేతిక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ అభివృద్ధి చేసిన ఈ సాంకేతిక వ్యవస్థను పట్టణ వరదలను ముందుగానే గుర్తించి, సంబంధిత యంత్రాంగాన్ని అధికారులను అప్రమత్తం చేస్తూ సమయానుకూల చర్యలు చేపట్టడానికి దోహదపడుతుంది. ఆర్టీజీఎస్‌లోని అవేర్ విభాగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ)తో కలిసి,

మిగతా 2లో...

## పొగాకు రైతులకు భరోసా



- కేంద్రంతో కలిసి సమస్య పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం కసరత్తు
- వడ్డీలేని రుణాలు, ప్రోత్సాహకాలు, ధర లోటు భర్తీపై ప్రతిపాదనలు
- బయ్యర్లతోనూ చర్చలకు శ్రీకారం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని పొగాకు రైతులను ఆదుకోవాలంటూ కేంద్ర ప్రభుత్వంతో సీఎం చంద్రబాబు చేపడుతున్న నిరంతర సంప్రదింపులతో రాష్ట్రంలోని పొగాకు రైతుల సమస్యలపై కేంద్రం దృష్టి సారించింది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ నుంచి ఆ శాఖ అదనపు సెక్రటరీ నితిన్ కుమార్ యాదవ్, డైరెక్టర్ మౌనికా గౌర్ ను రాష్ట్రానికి పంపింది. కర్నూలు జిల్లా పర్యటనకు బయలు దేరే ముందు సీఎం చంద్రబాబుతో వీరు భేటీ అయ్యారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, వ్యవసాయ శాఖ, మార్క్ ఫెడ్ ఉన్నతాధికారులు, టుబాకో బోర్డు ప్రతినిధులు ఈ భేటీలో పాల్గొన్నారు. పొగాకు రైతులను ఆదుకునేలా సిద్ధం చేసిన 3 ప్రతిపాదనలపై సీఎంతో కేంద్ర ప్రతినిధులు చర్చించారు. వడ్డీ లేకుండా వర్కింగ్ క్యాపిటల్ రుణాల జారీ, ప్రోత్సాహకాలు, ధర లోటు భర్తీ వంటి ప్రతిపాదనలను రూపొందించారు. ఈ ప్రతిపాదనలపై పూర్తి స్థాయిలో చర్చించాలని... ఏ నిర్ణయం తీసుకున్నా పొగాకు రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇదే సయయంలో ప్రతేడాది పొగాకు రంగంలో ఇదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

మిగతా 2లో...

## ఎల్‌నినోపై ఎమర్జెన్సీ కార్యాచరణ

- 24×7 కంట్రోల్ రూమ్.. రైతులకు నిరంతర వాతావరణ హెచ్చరికలు
- పంట రక్షణ, ప్రత్యామ్నాయ పంటలు, అత్యవసర విత్తనాలపై మిషన్ మోడ్‌లో చర్యలు: అచ్చెన్నాయుడు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షపాతం లోటు కొనసాగుతున్న నేపథ్యంలో ఎల్‌నినో పరిస్థితులను నిరంతరం నిశితంగా పర్యవేక్షిస్తూ రైతుల పంటలను రక్షించేందుకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. పంటల రక్షణ, నేలలో తేమ సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, అత్యవసర విత్తనాల లభ్యత, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ విధానాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల క్షేత్రస్థాయి అధికారులతో ఆదివారం వెబినార్ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నైరుతి రుతుపవనాల కాలంలో జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా లోటుగా నమోదైందన్నారు. సీజన్ సాధారణ వర్షపాతం 580.1 మి.మీ. కాగా, ప్రస్తుత తేదీ నాటికి సాధారణంగా 225.7 మి.మీ. వర్షపాతం నమోదవ్వాల్సి ఉందని, అయితే కేవలం 104.5 మి.మీ. మాత్రమే నమోదై 53.7 శాతం లోటు ఏర్పడిందని వివరించారు. మొత్తం 28 జిల్లాల్లో 21 జిల్లాలు 'వర్షపాతం లోటు' కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. పశ్చిమ గోదావరి, అన్నమయ్య, తూర్పు గోదావరి, విశాఖపట్నం, చిత్తూరు, ప్రకాశం జిల్లాలు కలిపి ఆరు జిల్లాలు 'తీవ్ర వర్షపాతం లోటు' కేటగిరీలో ఉన్నాయని,

మిగతా 2లో...

## తెలుగు వెలుగులు నలుదిశలా

- భాషా వైభవాన్ని భావితరాలకు చాటేలా ఏటా మహోత్సవాలు
- ఉండవల్లి గుహల్లో రెండు రోజుల వేడుకలకు ఘన ముగింపు.. కవులు, కళాకారులకు సన్మానం




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగు భాషా, సాంస్కృతిక వైభవాలు నలుదిశలా వెలుగొందేలా ఇకపై ప్రతి ఏటా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో 'తెలుగు మహోత్సవం' వేడుకలను నిర్వహించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

మిగతా 2లో...

# ఉద్యోగుల ఆనందోత్సాహం... 'థ్యాంక్యూ సీఎం సర్'తో మార్మోగిన రాజధాని



- 20 ఏళ్ల నిరీక్షణకు తెర... మంగళగిరిలో ఉద్యోగుల భారీ కృతజ్ఞత సభ
- పాత పెన్షన్ పునరుద్ధరణతో ఉద్యోగుల్లో ఆనందం
- జి.ఓ. 53తో ఉద్యోగుల ఆకాంక్ష నెరవేర్చిన కూటమి ప్రభుత్వం
- పాత పెన్షన్ పునరుద్ధరణపై సీఎం చంద్రబాబుకు ఉద్యోగుల ఘన కృతజ్ఞతలు

**మంగళగిరి, జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది రెండు దశాబ్దాలుగా ఎదురుచూసిన పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల రాష్ట్రవ్యాప్తంగా హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. జి.ఓ. నెం.53 ద్వారా పాత పెన్షన్ విధానాన్ని అమల్లోకి తీసుకురావడాన్ని స్వాగతిస్తూ ఈ చారిత్రాత్మక నిర్ణయాని డీఎస్సీ-2003 ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పోలీసుల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరిలో భారీ కృతజ్ఞత సభ నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన సుమారు మూడు వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వానికి అభినందనలు తెలిపారు. "థ్యాంక్యూ సీఎం సర్" నినాదాలతో సభా ప్రాంగణాన్ని మార్మోగించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, పాత పెన్షన్ పునరుద్ధరణకు ప్రతీకగా జి.ఓ. నెం.53 స్ఫూర్తితో రెండు మొక్కలను నాటారు.

మిగతా 2లో...





## వరదలపై డిజిటల్ నిఘా

(మొదటి పేజీ తరువాయి)

ఐఐటీ గాంధీనగర్ నిపుణుల సహకారంతో ఈ సిటీ ఫ్లడ్ అలెర్ట్ వ్యవస్థను రూపొందించింది. కృత్రిమ మేధస్సు, ఉపగ్రహ ఆధారిత చిత్రాల విశ్లేషణ, ప్రిడిక్టివ్ అనలటిక్స్, హైడ్రోలాజికల్ మోడలింగ్ వంటి అత్యాధునిక టెక్నాలజీ మేళవింపుతో పట్టణ ప్రాంతాలకు ఖచ్చితమైన వరద అంచనాలు, ముందస్తు హెచ్చరికలను జారీ చేస్తుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఆర్టీజీఎస్ రూపొందించిన ఈ వ్యవస్థ ముందస్తు విపత్తు నిర్వహణకు, పట్టణాల వాతావరణానుకూల సామర్థ్య పెంపునకు కీలకంగా పనిచేస్తుంది.

**ఇదో డిజిటల్ రక్షా కవచం :** పట్టణాలకు పొంచి ఉన్న వరద విపత్తుల నుంచి భయటపడటానికి ఇదో డిజిటల్ రక్షాకవచంగా పనిచేస్తుంది. సిటీ ఫ్లడ్ అలర్ట్ వ్యవస్థకు ఉపగ్రహ చిత్రాల ఆధారంగా రూపొందించిన హై రెజల్యూషన్ డిజిటల్ ఎలివేషన్ మోడల్ కీలకంగా పని చేస్తుంది. విజయవాడ నగరానికి సంబంధించి ఉపగ్రహ చిత్రాలు తీసుకుని, నగరంలో గత 30 సంవత్సరాల్లో వచ్చిన వరదలు, కురిసిన వర్షాలు, నగరానికి వచ్చిన నీటి పరిమాణం తదితర అంశాలతో కూడిన హిస్టారికల్ డేటాను డిజటలీకరణ చేశారు. తద్వారా నగరంలో వరద ప్రభావిత ప్రాంతాలను, ఎక్కడ అధికంగా వర్షాలు పడొచ్చు, ఎక్కడ వరదలు రవొచ్చు, ఎక్కడ నీరు ముందుకెళ్లకుండా నిలిచిపోవచ్చు అనేదాన్ని వార్డుల వారీగా మ్యాపింగ్ చేశారు. వరద ముప్పు ఎక్కువ ఉండటానికి ఆస్కారమున్న ప్రాంతాలను హాట్ స్పాట్ లుగా గుర్తించి మ్యాపింగ్ చేశారు.

**ఆరు గంటల ముందుగానే అంచనా :** సిటి ఫ్లడ్ అలెర్ట్ వ్యవస్థ ద్వారా భవిష్యత్తులో విజయవాడకు ఎప్పుడు ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) ఏర్పడినా దాన్ని ఆరు గంటల ముందుగానే ఈ వ్యవస్థ పసిగడుతుంది. నగరంలో వర్ష సూచనలను రెండు రోజులు ముందుగానే ఆర్టీజీఎస్ పసిగడుతుంది. భవిష్యత్తులో బుడమేరు నుంచి ఆకస్మిక వరదలు వస్తే దాన్ని ఆరు గంటలముందుగానే కృత్రిమ మేధ ద్వారా ఈ వ్యవస్థ అంచనా వేస్తుంది. ఈ సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ)ఆటోమేటిగ్గా వెళ్లేలా అనుసంధానం చేశారు.

**త్వరలో అన్ని మున్సిపాల్టీలకు :** ఈ సిటీ ఫ్లడ్ అలర్ట్ వ్యవస్థను ముందుగా విజయవాడ నగరంలో వరదల నియంత్రణ కోసం రూపొందించారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాలకు కూడా విస్తరించనున్నారు. ప్రతి నగరం, పట్టణాన్ని దీనికోసం ప్రత్యేకంగా డిజటలీకరణ చేస్తారు. ఆయా పట్టణాలు, నగరాల్లో గతంలో వచ్చిన వరదల హిస్టారికల్ డేటా ఆధారంగా విశ్లేషణ చేసి అయా ప్రాంతాల్లో వదర ముప్పు హాట్ స్పాట్లు రూపొందిస్తారు.

**గుర్గావ్‌లో విజయవంతమైన వ్యవస్థ :** గాంధీనగర్ ఐఐటీ నిపుణులు ఈ సిటీ ఫ్లడ్ అలెర్ట్ వ్యవస్థను గుర్గావ్ నగరంలో వరదల నివారణకు ప్రయోగాత్మకంగా అమలు చేసి విజయం సాధించారు. దీన్ని ఫ్లడ్ అస్త్ర పేరుతో ఈ అప్లికేషన్‌ను వారు అమలు చేశారు. అదే రీతిలో విజయవాడ నగరానికి, రాష్ట్రంలోని అన్ని యూఎల్‌బీల్లోనూ సిటీ ఫ్లడ్ అలెర్టు పేరిట ఈ అప్లికేషన్‌ను అమలు చేయనున్నారు.

## పొగాకు రైతులకు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

తాత్కాలిక ఉపశమన చర్యలతో సరిపెట్టకుండా, షార్ట్ టర్మ్, మీడియం టర్మ్, లాంగ్ టర్మ్ వ్యూహాలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు. కేంద్రం వైపు నుంచి ఏ మేరకు సాయం అందించగలరు... రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి తీసుకోవాల్సిన చర్యల పైనా చర్చించి తుది నిర్ణయానికి రావాలని ముఖ్యమంత్రి చెప్పారు. రైతులు, బయ్యర్లు, టొబాకో బోర్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఇలా అందరూ స్టేక్‌హోల్డర్లేనని, అందరి బాధ్యతతోనే సమస్యకు పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిస్థితులు, మార్కెట్ డిమాండ్ వంటి అంశాలను కూడా దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పంటను ఒకటి, రెండేళ్లు నిల్వ ఉంచే అవకాశాలున్నాయా..? ధరలు స్థిరపడిన తర్వాత విక్రయించుకోవచ్చా.. అనే అంశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. లో, మీడియం, హై గ్రేడ్ పొగాకును మార్కెట్‌లో ఎలా విక్రయించాలనే దాని పైనా ట్రేడర్లతో మాట్లాడి ఓ కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. పొగాకు రంగంలో భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా సమర్థవంతమైన నియంత్రణ వ్యవస్థ అవసరమన్నారు. సమస్యకు పరిష్కారం చూపే క్రమంలో రైతుల ప్రయోజనాలకు హై ప్రయార్టీ ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇదే సమయంలో ట్రేడర్ల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఓ నిర్ణయానికి వస్తే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చక్కటి విధానాన్ని రూపొందించవచ్చని సీఎం సూచించారు. ఈ మేరకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ లీడ్ తీసుకుని చర్చలను కొనసాగించాలని సూచించిన ముఖ్యమంత్రి కర్నూలు జిల్లా పర్యటనకు బయలుదేరారు. ఈ సమావేశం సందర్భంగా మంత్రులు గొట్టిపాటి, డీబీవీ స్వామి, అలాగే ఉమ్మడి ప్రకాశం జిల్లా సహా నరసరావుపేట, రాజానగరం, పోలవరం నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు పొగాకు రైతులు పడుతున్న ఇబ్బందులను కేంద్ర ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ట్రేడర్లతో కేంద్రం సంప్రదింపులు జరిపి సమస్యను పరిష్కరిస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఈ సమావేశానికి వర్చువల్ గా మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి హాజరయ్యారు.

**ట్రేడర్లతో కేంద్ర మంత్రి పెమ్మసాని చర్చలు :** సీఎం చంద్రబాబు కర్నూలు జిల్లా పర్యటనకు బయలుదేరిన అనంతరం పలువురు ముఖ్యమైన పొగాకు బయ్యర్లతో కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధులతో కలిసి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వర్చువల్ గా సమావేశమయ్యారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు కేంద్ర –రాష్ట్ర ప్రభుత్వాలు, అలాగే టుబాకో బోర్డు ముందుకు వచ్చాయని.. రైతులకు మేలు చేసేలా బయ్యర్లు కూడా ఓ అడుగు ముందుకు వేయాలని పెమ్మసాని సూచించారు. రైతులు నష్టపోకుండా ట్రేడర్ల వైపు నుంచి ఏమేం చేయగలరోననే అంశాన్ని చర్చించుకుని మంచి ప్రతిపాదనలతో రావాలని కోరారు. సోమవారం మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

## ప్రెసిడెన్షియల్ ఆర్డర్-2025పై ఉద్యోగుల చర్చా వేదిక



- **ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహణ**

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** ప్రెసిడెన్షియల్ ఆర్డర్–2025పై ప్రభుత్వ ఉద్యోగుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేసేందుకు ఏపీ జేఏసీ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ కార్యాలయంలో చర్చా వేదిక నిర్వహించారు.

జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు, సంఘాల నాయకులు పాల్గొని ప్రెసిడెన్షియల్ ఆర్డర్--2025లోని నిబంధనలు, అమలు విధానం, ఉద్యోగులపై ప్రభావం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్ ఉద్యోగులు అడిగిన పలు సందేహాలకు సమాధానాలు ఇచ్చి, ఆర్డర్‌కు సంబంధించిన ముఖ్యమైన అంశాలను వివరించారు.

కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు, గుంటూరు ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల కళ్యాణ్ కుమార్, కార్యదర్శి జీవీ కోటేశ్వరరావు, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల ఆనందోత్సాహం...‘థ్యాంక్యూ సీఎం సర్’తో మార్మోగిన రాజధాని

(మొదటి పేజీ తరువాయి)

సభకు అధ్యక్షత వహించిన కె. ఎల్. శ్రీనాథ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో నెం. 57కు అనుగుణంగా రాష్ట్రంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం ఉద్యోగుల జీవితాల్లో చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఉద్యోగుల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం అమలుకు సహకరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపేందుకే లబ్ధిదారులైన ఉద్యోగులు స్వచ్ఛందంగా ఈ కృతజ్ఞత సభను నిర్వహించారని తెలిపారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు బాష్యం రామకృష్ణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 2020లో జారీ చేసిన మెమో నెం. 57ను రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేసిన ఘనత చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ఉద్యోగుల సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకుని వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ సానుకూలంగా వ్యవహరిస్తోందని చెప్పారు. ఉద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం చంద్రబాబు నాయకత్వానికి ఉన్న విశ్వసనీయతకు నిదర్శనమని పేర్కొన్నారు.

కృష్ణా–గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, పదవీ విరమణ అనంతరం ఉద్యోగుల జీవితానికి ఆర్థిక, సామాజిక భద్రత కల్పించే అత్యంత కీలకమైన సంక్షేమ విధానం పాత పెన్షన్ విధానమని అన్నారు. ఉద్యోగుల దీర్ఘకాల డిమాండ్‌ను





గుర్తించి, ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ జి. ఓ. నెం. 53 ద్వారా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉద్యోగుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని చాటుకుందని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమాన్ని ప్రభుత్వ ప్రాధాన్యతగా భావించినందువల్లే ఈ చారిత్రాత్మక నిర్ణయం సాధ్యమైందన్నారు. పదవీ విరమణ అనంతరం ఉద్యోగులు, వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా భరోసా కల్పించే వ్యవస్థే పాత పెన్షన్ విధానమని చెప్పారు. ఉద్యోగుల నమ్మకాన్ని నిలబెట్టిన కూటమి ప్రభుత్వానికి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని, ఈ నిర్ణయం ఉద్యోగుల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ విప్, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి మాట్లాడుతూ, ఉద్యోగుల మేలు కోసం తీసుకున్న నిర్ణయానికి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా కృతజ్ఞతలు తెలియజేయడం అభినందనీయమన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ, పదవీ విరమణ అనంతరం ఉద్యోగులకు స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత కల్పించే వ్యవస్థ పాత పెన్షన్ విధానమేనన్నారు. ఈ నిర్ణయం వల్ల వేలాది మంది ఉద్యోగుల కుటుంబాలకు భవిష్యత్తుపై భరోసా ఏర్పడిందని పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు మాట్లాడుతూ, సీపీఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్, డెత్ కమ్ రిటైర్మెంట్ గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలు కల్పించిన నాయకుడు కూడా చంద్రబాబు నాయుడేనని గుర్తు చేశారు. ఉద్యోగుల సంక్షేమం విషయంలో చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు ఎప్పుడూ ఆదర్శంగా నిలిచాయని, మంచి చేసిన నాయకుడికి కృతజ్ఞతలు చెప్పడం ఉద్యోగుల బాధ్యత అని అన్నారు.

మాజీ అధికారి ఏ. ఎస్. రామకృష్ణ మాట్లాడుతూ, జి. ఓ. నెం. 53తో 20 ఏళ్లుగా కొనసాగిన నిరీక్షణకు ముగింపు లభించిందన్నారు. సీపీఎస్ కింద లభించే పరిమిత ప్రయోజనాలతో పోలిస్తే పాత పెన్షన్ విధానం ఉద్యోగులకు మెరుగైన సామాజిక, ఆర్థిక భద్రతను అందిస్తుందని వివరించారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా అమలు చేయడం వల్ల వేలాది మంది ఉద్యోగులు లబ్ధి పొందారని అన్నారు. కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఉద్యోగుల సంక్షేమానికి మరిన్ని నిర్ణయాలు అమలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్లు మోపిదేవి శివశంకరరావు, ఎం. వి. సుబ్బారెడ్డి, తమ్మినాగరాజు, బలగా శ్రీనివాస్, పి. సతీష్, అబ్దుల్ సమాయ్, బలగా శ్రీనివాసరావు, కె. శ్రీనివాసరావు, పి. శివప్రసాద్, వి. రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

సభ ముగింపులో “థ్యాంక్యూ సీఎం సర్” నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, పాత పెన్షన్ పునరుద్ధరణకు గుర్తుగా రెండు మొక్కలను నాటారు. ఉద్యోగుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధికి జి. ఓ. నెం. 53 నిదర్శనమని, ఉద్యోగుల సామాజిక భద్రతకు ఇది కొత్త భరోసాను కల్పించిందని సభలో పలువురు అభిప్రాయపడ్డారు.

## సంజీవనితో ఆరోగ్యాంధ్రకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానాల్లో ఆరోగ్య సంరక్షణ అందించే సమగ్ర నమూనానే సంజీవని అని ఆయన వివరించారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్, తల్లి–శిశు ఆరోగ్యం , RBSK, 108 అత్యవసర సేవలు, 104 మొబైల్ మెడికల్ యూనిట్లు, ఈ–ఔషధి, ల్యాబ్ సేవలు అన్నీ ఒకే డిజిటల్ వేదికపైకి రానున్నాయని చెప్పారు.


సంజీవని సిటిజన్ వెల్‌నెస్ యాప్ ద్వారా ప్రజలు ఆన్‌లైన్‌లో వైద్యుల అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవడంతో పాటు, తమ డిజిటల్ ఆరోగ్య రికార్డులను ఎప్పుడైనా చూసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

**ఆరోగ్యానికి జీవనశైలి కూడా కీలకం :** ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలు మాత్రమే కాకుండా ప్రజల్లో ఆరోగ్య చైతన్యం కూడా పెరగాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. మంచి ఆహారపు అలవాట్లు, యోగా, ధ్యానం, నిత్య వ్యాయామం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. జీవనశైలిలో మార్పులు తీసుకొస్తేనే వ్యాధులను దూరం పెట్టవచ్చని పేర్కొన్నారు.

**సంక్షేమ పథకాలతో ప్రజలకు భరోసా :** ప్రజా ఆరోగ్యంతో పాటు సంక్షేమానికీ కూటమి ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు చెప్పారు. ప్రతి నెల తొలి తేదీన సామాజిక పెన్షన్లు అందిస్తూ పేదలకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని తెలిపారు.

అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ. 20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు.

తల్లికి వందనం పథకం కింద కుటుంబంలో



ఎంతమంది పిల్లలు చదువుకుంటే అందరికీ ఆర్థిక సహాయం జమ చేస్తున్నామని పేర్కొన్నారు.

మహిళల సాధికారత కోసం స్త్రీశక్తి, వంటింటి భారాన్ని తగ్గించే దీపం--2.0, ప్రతి ఇంటికి సౌర విద్యుత్ వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు.


**భూ రికార్డులకు బ్లాక్‌చైన్ భద్రత :** గత ప్రభుత్వ హయాంలో ఏర్పడిన భూ వివాదాలను పరిష్కరించేందుకు రీ–సర్వే చేపట్టామని సీఎం తెలిపారు. ప్రజల భూ రికార్డులను బ్లాక్‌చైన్ టెక్నాలజీ ద్వారా భద్రపరుస్తూ, ప్రతి నెల 9వ తేదీన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా రీ–సర్వే పూర్తి చేసి ప్రజల ఆస్తులకు శాశ్వత భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.

**ఎల్‌నినో ప్రభావం... రైతులకు సీఎం సూచనలు :** ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా నదికి తగిన నీరు రాకపోవడంతో నీటి సంరక్షణ అత్యవసరమైందని చంద్రబాబు తెలిపారు. జలధార కార్యక్రమం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచే చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రైతులు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తక్కువ నీటితో సాగు చేసే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**రాయలసీమ అభివృద్ధికి భారీ పెట్టుబడులు :** రాయలసీమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని సీఎం తెలిపారు. వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను రూ. 1,768 కోట్లతో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మూడు సంవత్సరాల్లో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేలా ఇరిగేషన్ క్యాలెండర్ సిద్ధం చేశామని వెల్లడించారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభం లక్ష్యంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. హీరో మోటార్స్, ఎల్‌జీ, దాల్మియా వంటి అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయని చెప్పారు. రూ. 1 లక్ష కోట్ల ప్రభుత్వ–ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను దేశంలోనే ప్రముఖ ఉద్యానవన మరియు పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

**మహిళలకు రూ.197 కోట్ల ఆర్థిక చేయూత :** స్వయం సహాయ సంఘాల మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, ఆలూరులో రూ. 197 కోట్ల ఆర్థిక సహాయాన్ని మహిళల ఖాతాల్లో జమ చేసినట్లు సీఎం తెలిపారు. మహిళల సాధికారతే కుటుంబాభివృద్ధికి, గ్రామాభివృద్ధికి బలమైన పునాది అని ఆయన స్పష్టం చేశారు.

## నేతన్నలకు సంక్షేమానికి ఆర్థిక దన్ను



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య స్ఫూర్తితో చేనేతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. నేతన్నలు గౌరవప్రదమైన జీవనం సాగించేలా, వారికి ఆర్థిక మేలు చేకూరేలా సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. చేనేతల ఆత్మ గౌరవాన్ని పెంచుతూ, ప్రగడ కోటయ్య సేవలు భావి తరాలకు తెలియజేయాలన్న సంకల్పంతో ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా జరిగేలా ఉత్తర్వులు జారీచేశారన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఘనంగా ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత... ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి ప్రగడ కోటయ్య అలుపెరగని కృషి చేశారన్నారు. చేనేతల సమస్యల పరిష్కారాని నాలుగు చేనేత సత్యగ్రహ ఉద్యమాలు నిర్వహించిన పోరాట యోధుడని కొనియాడారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యునిగా చట్టసభల్లో చేనేత వాణి వినిపించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200లకు పైగా చేనేత సహకార సంఘాలు కోటయ్య ఏర్పాటు చేరన్నారు. కోటయ్య సేవలను భావి తరాలకు తెలియజేయాలన్న సంకల్పంతో ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ నిర్ణయించామన్నారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారన్నారు. ప్రగడ కోటయ్య స్ఫూర్తితో సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. నేతన్నలకు ఆర్థిక దన్ను కలిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఆగస్టు 7 నుంచి నేతన్న సేవలో..పథకానికి శ్రీకారం చుడుతున్నారని, ఈ పథకం కింద ఏటా రూ. 25 వేలు అందజేయనున్నారని తెలిపారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధిలో భాగంగా చేనేత క్లస్టర్లు, పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు నందం అబద్ధయ్య,చిలకలపూడి పాపారావు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జి. ధనుంజరావు, చేనేత సంఘాల ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగు వెలుగులు నలుదిశలా

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా ఉండవల్లి గుహల ప్రాంగణంలో రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన “తెలుగు మహోత్సవం” ముగింపు వేడుకలకు మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రాంగణానికి విచ్చేసిన మంత్రివర్యులకు జానపద కళారూపాలు, మంగళవాయిద్యాలతో నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమం అనంతరం తెలుగు భాష వ్యాప్తి కోసం కృషి చేసిన పలువురు కవులను, డిజిటల్ మాధ్యమంలో తెలుగు ఉనికి కోసం పోరాడుతున్న సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లను మంత్రి దుర్గేష్ సన్మానించారు.

తెలుగు భాషపై ఉన్న ప్రత్యేక అభిరుచితో తనకు ఎంతో ఇష్టమైన ‘విశ్వక్సేనుడు’ అనే పదాన్ని మంత్రి దుర్గేష్ స్వయంగా తన దస్తూరితో రాసి భాషాభిమానాన్ని చాటుకున్నారు. మట్టి వాసనలు పరిమళించేలా కుండల తయారీని పరిశీలించారు. కాలిగ్రఫీ ద్వారా తన సంతకాన్ని తెలుగులో రాయడాన్ని ఆసక్తిగా గమనించారు. ప్రాచీన జానపద కళ రూపమైన తోలుబొమ్మలాటను స్వయంగా వీక్షించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్ స్కూల్‌లో రెండవ తరగతి చదువుతూనే అత్యంత స్పష్టతతో భగవద్గీత శ్లోకాలను పఠించిన ఒక చిన్నారిని మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జున రావు గీసిన ప్రత్యేక ఛాయాచిత్రాన్ని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సింహాద్రి వాణి రచించిన కవితా కుసుమాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా సామెతల చెట్టును ఆసక్తిగా తిలకించారు.

తెలుగు భాషా పరిరక్షణ, సాంస్కృతిక వైభవ పునరుద్ధరణే కూటమి ప్రభుత్వ లక్ష్యం: పర్యాటక,సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్

**మాతృభాషతోనే విద్యార్థుల్లో సర్వతోముఖాభివృద్ధి :** తెలుగు భాషను ప్రపంచ శిఖరాగ్రాన నిలబెట్టాలనే ఉన్నతమైన ఉద్దేశంతోనే చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఉండవల్లి గుహల వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో తెలుగును విరివిగా ఉపయోగిస్తూ, భావితరాలకు దీనిని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆంగ్ల భాషా పరిజ్ఞానం నేటి అవసరమే అయినప్పటికీ, మాతృభాషను



ఏమాత్రం విస్మరించకూడదని విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక స్థాయిలో బోధన మాతృభాషలోనే సాగినప్పుడు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా దృక్పథం పెరుగుతాయని, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రాధాన్యతను గుర్తించే సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రాథమిక విద్యలో తెలుగు భాషను తప్పనిసరి చేసిందని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన నిర్లక్ష్యాన్ని అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**ప్రాచీన భాషా పరిణామక్రమంపై డాక్యుమెంటేషన్ :** తమిళుల తరహాలో ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తెలుగు భాషా పరిణామక్రమాన్ని సమగ్రంగా వివరించేలా ఒక ప్రత్యేక డాక్యుమెంటేషన్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. తెలుగు సాహిత్యాన్ని గ్రంథస్థం చేస్తూ, అక్షర రూపాన్ని పరిరక్షిస్తూ భావితరాలకు అందించేందుకు కూటమి ప్రభుత్వం నూరు శాతం ప్రోత్సాహాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. మాతృభాష ఏమాత్రం మృతభాషగా మారకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

**జానపద కళారూపాలు, నాటక రంగానికి పూర్వవైభవం :** మన రాష్ట్రానికి సొంతమైన పద్య నాటకంతో పాటు తోలుబొమ్మలాట, హరికథ, బుర్రకథ వంటి ప్రాచీన జానపద కళారూపాలను, పౌరాణిక, సాంఘిక నాటకాలను, పద్య నాటకాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి దుర్గేష్ ఉద్ఘాటించారు.

**కళాకారులకు ప్రోత్సాహం:** ఇప్పటికే కవులు, కళాకారులు, సాంస్కృతిక రంగానికి పెద్దపీట వేస్తూ ఉగాది కళారత్న పురస్కారాలు, తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా కందుకూరి పురస్కారాలు మరియు తెలుగు భాషా పురస్కారాలను, గుర్రం జాషువా, బోయి భీమన్న పురస్కారాలను అందించామని తెలిపారు. నాటక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు త్వరలోనే నంది నాటకోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా తెలుగు ఉన్నతికి కృషి చేసిన మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను ఆగస్టు 4న విజయవాడలో నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 29న ఘనంగా తెలుగు భాషా దినోత్సవాన్ని, తెలుగు పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా తెలుగు భాషా వికాసానికి కృషి చేసిన మహనీయులను స్మరించుకున్న మంత్రి దుర్గేష్ తెలుగు భాషకు నిజమైన రాయబారి మండలి బుద్ధ ప్రసాద్ అని కొనియాడారు. అలాగే తెలుగు భాషా పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న తేజస్వి పొడపాటి సేవలను అభినందించారు.

**భాషా వికాసానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ :** అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ.. కాక్రోచ్ ఉద్యమం మాదిరిగా ప్రతి ఒక్కరూ తెలుగు భాషా పరిరక్షణకు, ఉనికికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. మంత్రి కందుల దుర్గేష్ పర్యాటక, భాషా సాంస్కృతిక రంగాల అభివృద్ధికి, భాషా వికాసానికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. తాము గతంలో భాష కోసం అనేక పోరాటాలు చేశామని, అయితే తొలిసారిగా యువతను భాగస్వామ్యం చేస్తూ “తెలుగు భవితను” ప్రోత్సహించేలా ఇలాంటి మహోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.

తెలుగును ముందటి తరాలకు అందించే ప్రయత్నమే ‘తెలుగు మహోత్సవం’: ఏపీ సృజనాత్మక, సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మన మాతృభాష తెలుగును భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించాలనే సంకల్పంతోనే ‘తెలుగు మహోత్సవం’ లాంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక మరియు సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి తెలిపారు. తెలుగు అత్యంత అందమైన, శ్రవణ సుందరమైన భాష అని కొనియాడిన ఆమె, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని భాషా వికాసానికి కృషి చేసిన మహనీయులను స్మరించుకున్నారు. నాటి వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు నుండి నేటి తరంలో భాషా సమృద్ధికి, పత్రికారంగానికి వన్నె తెచ్చిన ఈనాడు సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు వరకు తెలుగు భాష కోసం చేసిన విశేష కృషిని వివరించారు. తెలుగు భాష ఉనికి కోల్పోకుండా, అంతరించిపోకుండా కాపాడుకోవడమే ధ్యేయంగా ఇటువంటి వేడుకల ద్వారా నేటి తరం పిల్లలు, యువతలో భాష పట్ల పూర్తి అవగాహన నింపుతున్నామని చెప్పారు. నేటి తరం పిల్లలకు తెలుగుపై ఎలాంటి ద్వేషం లేదని, అయితే భాషను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా వారి నిత్య జీవితంలో అనుభవపూర్వకంగా ఉపయోగించే వాతావరణాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వంలో తెలుగు భాషకు, సంస్కృతికి అత్యంత ప్రాధాన్యత లభిస్తుందని, రాబోయే రోజుల్లో భాషకు మంచి రోజులు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. మనందరం ఐక్యంగా నిలబడి తెలుగు భాషా ఉనికిని, అస్తిత్వాన్ని కాపాడుకుందామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

లిమండలి వెంకటకృష్ణా రావు అధికార భాషసంఘం చైర్మన్ త్రివిక్రం రావు మాట్లాడుతూ..లి తెలుగు ఉనికి కోసం, ఉన్నతి కోసం ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని అన్నారు. తెలుగు అంతరించి పోయే ప్రమాదం లేదన్నారు. తెలుగు భాషా వికాసం కోసం మంత్రి కందల దుర్గేష్ చేస్తున్న ప్రయత్నాన్ని అభినందించారు.

**మంత్రి కందుల దుర్గేష్ చొరవతోనే ఈ ఉత్సవం: రేగుళ్ల మల్లికార్జున రావు**

రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జున రావు మాట్లాడుతూ.. మంత్రి కందుల దుర్గేష్ చూపిన ప్రత్యేక శ్రద్ధ, చొరవ వల్లే చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఉండవల్లి గుహల వద్ద ఈ మహోత్సవాన్ని అత్యంత జయప్రదంగా నిర్వహించగలిగామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఈ వేదికను ఏర్పాటు చేసినందుకు మంత్రి దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం ప్రముఖ గాయని శోభరాజ్ తెలుగు భాషా తియ్యదనాన్ని, దాని విశిష్టతను వివరిస్తూ అన్నమయ్య గేయాలు ఆలపించారు.

# గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ

- ఎస్ఆర్ఎం-సీఆర్డీఏ సంయుక్త నిర్వహణ
- ఇప్పటికే 3316 మందికి శిక్షణ పూర్తి
- గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కీలక పాత్ర
- సీఆర్డీఏ సహకారంతో ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాల దిశగా ప్రత్యేక శిక్షణలు



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ):** గ్రామీణ యువతకు వివిధ రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చేయూతనందిస్తోంది. సీఆర్డీఏ భాగస్వామ్యంతో రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాల యువతతో పాటు మహిళలు, నిరుద్యోగ యువతీ యువకులకు ఆధునిక రంగాల్లో ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, సీఆర్డీఏ కూడా రాజధాని గ్రామాల ప్రజలకు ఉపాధి ఆధారిత శిక్షణ అందించేందుకు ఎస్ఆర్ఎం యూనివర్సిటీతో కలిసి గత ఆరు నెలలుగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

**ఆధునిక కోర్సుల్లో శిక్షణ :** యూనివర్సిటీలో డిజిటల్ మార్కెటింగ్, వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టమ్స్, సైబర్ సెక్యూరిటీ, జీఎస్టీ, టాలీ, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రతి కోర్సుకు నిర్ణీత కాలపరిమితితో అనుభవజ్ఞులైన శిక్షకుల ద్వారా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు.

**ఇప్పటికే 3,316 మందికి శిక్షణ :** జనవరిలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఇప్పటికే రెండు బ్యాచ్‌లు పూర్తయ్యాయి. జూలై 12 నాటికి 3,316 మంది యువతీయువకులు శిక్షణ పూర్తి చేయగా, ప్రస్తుతం మూడో బ్యాచ్‌లో 1,116 మంది శిక్షణ పొందుతున్నారు. శిక్షణ పూర్తి చేసిన వారిలో పలువురు ఇప్పటికే ఉద్యోగాల్లో చేరగా, మరికొందరు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తున్నారు.



**వరల్డ్ బ్యాంక్ బృందం ప్రశంస :** ఇటీవల ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరుగుతున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను వరల్డ్ బ్యాంక్ ప్రతినిధుల బృందం పరిశీలించింది. శిక్షణ పొందుతున్న మహిళలు, యువతతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుని కార్యక్రమంపై సంతృప్తి వ్యక్తం చేసింది.



**గ్రామాల నుంచి ఉచిత రవాణా :** శిక్షణార్థుల కోసం ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రత్యేకంగా ఏసీ బస్సులను ఏర్పాటు చేసింది. కృష్ణాయపాలెం, పెనుమాక, ఉండవల్లి, నిడమర్రు, కురగల్లు, వెంకటపాలెం, మందడం, వెలగపూడి, రాయపూడి, తుళ్లూరు, పరిమి, నీరుకొండ, నవులూరు, యర్రబాలెం, మంగళగిరి తదితర గ్రామాల నుంచి ప్రతిరోజూ శిక్షణార్థులను యూనివర్సిటీకి తీసుకువచ్చి, సాయంత్రం తిరిగి గ్రామాలకు చేర్చుతున్నారు. అవసరమైన భోజన, రవాణా, పర్యవేక్షణ సదుపాయాలు కూడా కల్పిస్తున్నారు.

**మహిళలకు బ్యూటీషియన్ కోర్సులకు విశేష ఆదరణ :** మహిళలు ముఖ్యంగా బ్యూటీషియన్ కోర్సులపై ఆసక్తి చూపుతున్నారు. ఫేషియల్, మేకప్, డీటాన్, నెయిల్ షేపింగ్, హెయిర్ స్టైలింగ్, థ్రెడింగ్ వంటి అంశాల్లో మూడు నెలలపాటు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేసి, సొంతంగా బ్యూటీ పార్లర్లు ప్రారంభించేలా ప్రోత్సహిస్తున్నారు.

**యూనివర్సిటీ యాజమాన్యం :** ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ కల్లూరి మాట్లాడుతూ, శిక్షణలో ఎలాంటి ఆటంకాలు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ హెడ్ చాల మురుగన్ మాట్లాడుతూ, ఇప్పటివరకు 3,316 మందికి శిక్షణ అందించామని, ప్రస్తుతం 1,116 మంది శిక్షణ పొందుతున్నారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అనేక మంది ఉద్యోగాలు సాధించడంతో పాటు మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. శిక్షణ పొందుతున్న సాయి స్నిగ్ధ, ఫణీంద్ర, జి. శ్రావంతి తదితరులు కూడా డిజిటల్ మార్కెటింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్యూటీషియన్ కోర్సుల్లో నాణ్యమైన శిక్షణ లభిస్తోందని, ఈ కార్యక్రమం తమ భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడుతోందని అభిప్రాయపడ్డారు.

## ప్రభుత్వ నిర్ణయానికి పూర్తి సహకారం...



“ గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ అందించి వారి ఉపాధి అవకాశాలను మెరుగు పర్చాలన్న ప్రభుత్వ నిర్ణయానికి పూర్తిగా సహకారం అందిస్తున్నాం. వృత్తిపరమైన నైపుణ్య శిక్షణతో కంప్యూటర్, టీవీ మెకానిజం కోర్సుల్లో యువకులకు అనుభజ్ఞులైన డ్రైవర్లతో శిక్షణ అందిస్తున్నాం. తరగతులు సజావుగా సాగుతున్నాయి. వీరికి అవసరమైన రవాణా, భోజన సదుపాయాలను కూడా కల్పించాము.

**ప్రొఫెసర్ సతీష్ కుమార్, వైస్ ఛాన్సలర్, ఎస్ఆర్ఎం వర్సిటీ**

## ప్రస్తుతం 3వ బ్యాచ్....



“ జనవరిలో ప్రారంభమైన నైపుణ్య శిక్షణ తరగతులు సజావుగా సాగుతున్నాయి. ఇప్పటి వరకూ 3316 మందికి శిక్షణ అందించాం. మరో 1116 మంది శిక్షణలో ఉన్నారు. తరగతులు నిర్వహణ కోసం మంది ట్రైనర్లను ఏర్పాటు చేశాం. గ్రామీణ మహిళలు ఎక్కువ మంది బ్యూటీషియన్ కోర్సులకు హాజరవు తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు స్వయంగా సెంటర్లు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధిని పొందుతున్నారు.

**బాల మురుగన్, స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ హెడ్ ఎస్ఆర్ఎం వర్సిటీ**

## ఆటంకాలు లేకుండా శిక్షణ



“ ప్రభుత్వం సూచించిన విధంగా గ్రామీణ యువతీయువకులకు, ప్రభుత్వ రంగాల్లో పనిచేసే వివిధ కేటగిరీల ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ అందించే విషయంలో ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నిత్యం పర్యవేక్షణ కొనసాగుతుంది. శిక్షణ కోసం వివిధ జిల్లాల నుంచి వచ్చే మహిళల కోసం సురక్షితమైన వసతి సదుపాయాలను కల్పించాం.

**డాక్టర్ వినాయక్ కల్లూరి, రిజిస్ట్రార్, ఎస్ఆర్ఎం వర్సిటీ.**

## ఆసక్తికి అనుగుణంగా శిక్షణ...



బ్యూటీషియన్ కోర్సులు నేర్చుకోవడానికి ఎక్కువ మంది మహిళలు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం 3వ బ్యాచ్లో 50 మందికి పైగా మహిళలు శిక్షణ పొందుతున్నారు. ఫేషియల్ మేకప్, డీటాన్, నెయిల్ షేపింగ్, హెయిర్ స్టయిల్, థ్రెడ్డింగ్ వంటి సౌందర్యాన్ని మెరుగు పర్చుకునే విషయాలను నేర్పుతున్నాము. ఇది మూడు నెలల ప్రోగ్రామ్, శిక్షణ పూర్తి చేసుకున్న వారు సర్టిఫికెట్ తీసుకుని సొంతంగా బ్యూటీ పార్లర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు.

**వాసవి. కాస్మోటాలజిస్ట్**

## డిజిటల్ మార్కెటింగ్లో శిక్షణ తీసుకున్నా...



నా పేరు సాయి స్నిగ్ధ. మాది మంగళగిరి. రెండు వారాలుగా నైపుణ్య శిక్షణకు హాజరవుతున్నాను. డిజిటల్ మార్కెటింగ్లో చాలా మెళకువలు నేర్చుకున్నాను. ప్రాక్టికల్ ప్రజెంటేషన్ చేసే విధానంతో పాటు స్పీకింగ్ స్కిల్స్ ను డెవలప్ చేసుకున్నాను. థాంక్స్ టు సీఆర్డీఏ అండ్ ఎస్ఐ ఆర్ ఎం.

**సాయి స్నిగ్ధ, మంగళగిరి**

## ఇక్కడ శిక్షణ బాగుంది...



నెల రోజులుగా వైపుణ్య శిక్షణకు హాజరవుతున్నాను. ఇక్కడ సైబర్ సెక్యూరిటీ అంశంలో కీలక సూత్రాలు నేర్చుకుంటున్నా ఫ్రైవర్లు సమగ్రంగా నేర్పుతున్నారు. టూల్స్, ఫైల్బల్స్ ఎలా ఉపయో గించాలో చెబుతున్నారు. మరో రెండు వారాల్లో నా శిక్షణ ముగుస్తుంది. ఆపైన ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభిస్తాను.

**ఫణీంద్ర, తుళ్లురు**

## శిక్షణ చాలా బాగుంది... :



రెండు నెలలుగా ఇక్కడ బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ తీసుకుంటున్నా. శిక్షణ ఎంతో ఆసక్తిగా కొనసాగుతుంది. మహిళల సౌందర్యాన్ని పెంచుకునే వివిధ రకాల కోర్సులను క్షుణ్ణంగా వివరిస్తున్నారు. ఈ తరహా శిక్షణ ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి, అందుకు సహకరిస్తున్న ఎస్ఎల్ఎం యూనివర్సిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు...

**జీ స్రవంతి. యర్రబాలెం, మంగళగిరి**

# ఎల్‌నినోపై ఎమర్జెన్సీ కార్యాచరణ

(మొదటి పేజీ తరువాయి)

నెల్లూరు జిల్లాలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైందని చెప్పారు. మండల స్థాయిలో 249 మండలాలు 'తీవ్ర వర్షపాతం లోటు'లో, 359 మండలాలు 'వర్షపాతం లోటు'లో ఉండగా, కేవలం రెండు మండలాల్లో మాత్రమే 'అత్యధిక వర్షపాతం' నమోదైందని మంత్రి తెలిపారు. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, కోస్తాంధ్ర, రాయలసీమ అనే నాలుగు వ్యవసాయ వాతావరణ మండలాలన్నీ ఇప్పటికీ 'వర్షపాతం లోటు' కేటగిరీలోనే కొనసాగుతున్నాయని చెప్పారు. వంర్షపాతం పరిస్థితులకు అనుగుణంగా జిల్లాస్థాయి ప్రమాద అంచనాలు, రైతులకు సూచనలు, ప్రత్యామ్నాయ విత్తనాల ప్రణాళిక మరియు దశలవారీ పంటల అత్యవసర ప్రణాళిక చర్యలను ఇప్పటికే ప్రారంభించామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అంచనా వేసిన 8,489 రైతు సేవా కేంద్రాలు మరియు 688 మండలాల్లో, 1,357 రైతు సేవా కేంద్రాలు, 168 మండలాలు అధిక ప్రమాద స్థాయిలో ఉన్నాయని వివరించారు.

**సాగు విస్తీర్ణంపై ప్రత్యేక దృష్టి:** జూలై 25 నాటికి, 12 జిల్లాల్లో సాధారణంగా సాగు కావాల్సిన విస్తీర్ణంలో 50 శాతం కంటే తక్కువ విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయని మంత్రి తెలిపారు. అన్నమయ్య జిల్లాలో 9 శాతం, బాపట్లలో 5 శాతం, ప్రకాశంలో 15 శాతం మరియు మార్కాపురంలో 15 శాతంతో పరిస్థితి అత్యంత ప్రభావితంగా ఉందన్నారు. మరో 10 జిల్లాల్లో సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే 51 శాతం నుంచి 100 శాతం మధ్య సాగు నమోదైందని చెప్పారు. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, కర్నూలు, పశ్చిమ గోదావరి సహా ఆరు జిల్లాల్లో సాధారణ సాగు స్థాయిని మించి సాగు నమోదైందని మంత్రి వివరించారు. అధిక ప్రమాదంలో ఉన్న 168 మండలాల్లో, సీజన్ సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే 39 శాతం సాగు నమోదైందని తెలిపారు. కర్నూలు జిల్లాలోని అధిక ప్రమాద మండలాలు సాగులో ముందంజలో ఉండగా, మార్కాపురం ప్రాంతంలోని అధిక ప్రమాద మండలాలు రాష్ట్రంలో అత్యంత వెనుకబడి ఉన్నాయని చెప్పారు. సీజన్ సాధారణ పంట విస్తీర్ణం 30.84 లక్షల హెక్టార్లు కాగా, ఇప్పటివరకు మొత్తం 16.35 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయని, ఇది సీజన్ సాధారణ విస్తీర్ణంలో 39 శాతం మరియు ప్రస్తుత తేదీ నాటికి సాధారణంగా ఉండాల్సిన విస్తీర్ణంలో 74 శాతమని మంత్రి తెలిపారు. జనుము/మెస్తా, వరి, సోయాబీన్ , పత్తి పంటల సాగు తులనాత్మకంగా మెరుగైన పురోగతిని చూపుతోందని, వేరుశనగ, పొద్దుతిరుగుడు, జొన్న, ఉలవ పంటల సాగు గణనీయంగా వెనుకబడి ఉందని వివరించారు. రాష్ట్రంలో ప్రధాన పంటైన వరి, సీజన్ సాధారణ సాగు విస్తీర్ణంలో 34 శాతం, సాధారణంగా ఉండాల్సిన విస్తీర్ణంలో 79 శాతంగా నమోదైందని మంత్రి తెలిపారు.



**పీఎండీఎస్ ద్వారా రైతులకు విస్తృత సూచనలు :** రైతు సాధికార సంస్థ-పీఎండీఎస్ కింద 23 లక్షల మంది రైతులు, 25 లక్షల ఎకరాల లక్ష్యానికి గాను, ఇప్పటివరకు 14.82 లక్షల మంది రైతులు అంటే 67 శాతం, 16.67 లక్షల ఎకరాలు అంటే 64 శాతం లక్ష్యాన్ని సాధించామని మంత్రి తెలిపారు. పెల్లెటైజ్డ్ పీఎండీఎస్ కింద 4.19 లక్షల మంది రైతులు అంటే 28 శాతం, 4.20 లక్షల ఎకరాలు అంటే 25 శాతం పురోగతి నమోదైందన్నారు. అంతరకృషి, ఆకులపై ఎరువుల పిచికారీ, నేలలో తేమ సంరక్షణ, పంట పొలాల సరిహద్దుల్లో పంటల సాగుకు సంబంధించి రైతులకు 1.68 కోట్ల సూచనలు జారీ చేశామని మంత్రి తెలిపారు. కందులు, పెసలు, కొర్రలు, మినుములు, నువ్వులకు సంబంధించిన 14,078 క్వింటాళ్ల అత్యవసర ప్రత్యామ్నాయ విత్తనాలను ఏపీ స్టేట్ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా సిద్ధం చేశామని చెప్పారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాల్లో కూడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వరి పంట నుంచి ఇతర పంటలకు మార్పిడి చేయడానికి నిర్దేశించిన 1.29 లక్షల హెక్టార్ల లక్ష్యానికి గాను, ఇప్పటివరకు 11,422 హెక్టార్లు అంటే 9 శాతం మాత్రమే సాధించామని మంత్రి తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగును మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**అత్యవసర విత్తన ప్రణాళిక అమలు చేయాలి:** మొదటి దశలో జూలై 31 నాటికి ప్రధానంగా అనంతపురం, కర్నూలు, మార్కాపురం ప్రాంతాల్లోని 1.78 లక్షల హెక్టార్లకు 26,950 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని మంత్రి తెలిపారు. రెండో దశలో ఆగస్టు 15 నాటికి 21 జిల్లాల్లోని 429 మండలాల్లో 4.78 లక్షల హెక్టార్లకు అదనంగా 95,838 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని చెప్పారు. అవసరమైన విత్తనాలను సకాలంలో రైతులకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**జిల్లా వ్యవసాయ అధికారులకు కీలక ఆదేశాలు :** నీటిపారుదల ఆయకట్టు ప్రాంతాల్లో కూడా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడం, కాలువల ద్వారా నీటి విడుదలలు తక్కువగా ఉండటాన్ని దృష్టిలో ఉంచుకొని, నీటిపారుదల, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా కాలువ చివరి ప్రాంతాలు, తేమ కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. దీర్ఘకాలిక వరి రకాల నుంచి ఇతర ప్రత్యామ్నాయ పంటలకు మారేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పరిపాలన, వ్యవసాయ అనుబంధ శాఖలు, శాస్త్రవేత్తలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రులు , ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రత్యేక జిల్లా సమీక్ష, సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితిని ప్రతిరోజూ నిశితంగా పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయి అధికారులు అవసరమైన పంట రక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని స్పష్టం చేశారు. ఇంకా అమలు చేయని ప్రాంతాలతోపాటు ప్రధాన పంట సాగు ప్రాంతాల్లో కూడా పీఎండీఎస్ విత్తన పెల్లెటైజేషన్ కార్యక్రమాలను మిషన్ విధానంలో చేపట్టాలని సూచించారు. రైతుల వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రాంతాలవారీ ప్రత్యేక సూచనలను క్రమం తప్పకుండా రైతులకు పంపించాలని మంత్రి తెలిపారు. జిల్లా వ్యవసాయ అత్యవసర ప్రణాళికలకు అనుగుణంగా డీఏఏటీటీసీలు, కేవీకేలు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో సంప్రదించి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాల్లో అత్యధిక సంఖ్యలో రైతులు నమోదు అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావ నివారణ చర్యలను సమర్థంగా అమలు చేయడానికి అవసరమైన అన్ని అంశాల ప్రస్తుత పరిస్థితిని జిల్లా వనరుల కేంద్రాలు సమీక్షించాలని తెలిపారు. జిల్లా ప్రత్యేక రైతు సూచనలను విస్తృతంగా తెలియజేయడానికి ఐసీసీ హెల్ప్‌లైన్ 155251, టెలివిజన్, రేడియో, పత్రికలు, సామాజిక మాధ్యమాలు, ఐవీఆర్ఎస్/ఎస్ఎంఎస్, వాట్సాప్, రైతు సేవా కేంద్రాల ద్వారా విస్తృత రైతు సమాచార ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

**24×7 రాష్ట్ర ఎల్ నినో కంట్రోల్ రూమ్ ఏర్పాటు :** అన్ని జిల్లాలు, మండలాలు, రైతు సేవా కేంద్రాల్లో మిషన్ విధానంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తూ రాష్ట్ర ఎల్‌నినో పంట రక్షణ మిషన్‌ను ప్రారంభించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. వాతావరణం, ఉపగ్రహ సమాచారం, నీటి లభ్యత, క్షేత్రస్థాయి సమాచారాన్ని సమీకరించే విధంగా 24ఐ7 రాష్ట్ర ఎల్‌నినో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. దీని ద్వారా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, సకాలంలో సూచనలు ఇవ్వడం మరియు తక్షణ చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, కృషి విజ్ఞాన కేంద్రాలు, సంబంధిత శాఖలు, నీటిపారుదల శాఖ సంయుక్త క్షేత్ర పర్యటనల ద్వారా మండల స్థాయిలో శాస్త్రీయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. వాతావరణ సూచనలు, అత్యవసర పంటల ప్రణాళిక, నేలలో తేమ సంరక్షణ మరియు పంటలు వాడిపోవడం, ఎండిపోవడం నివారించడానికి తక్కువ ఖర్చుతో చేపట్టగల చర్యలపై ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహాలతో ప్రతి రైతు సేవా కేంద్రంలో ప్రతిరోజూ రైతు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. స్థానిక పంటల విధానం, నేల రకం, వర్షపాతం, నీటిపారుదల, భూగర్భ జలాల లభ్యత ఆధారంగా వరి నుంచి అనువైన ఆరుతడి పంటలకు మారేలా ప్రతి రైతు సేవా కేంద్రానికి ప్రత్యేక పంటల సూచనలు జారీ చేయాలని తెలిపారు. పంటలను కాపాడేందుకు అవసరమైన రక్షక తడులకు ప్రాధాన్యం ఇవ్వడం, కాలువల నీటి విడుదలలను శాస్త్రీయంగా ప్రణాళిక చేయడం మరియు సూక్ష్మ నీటిపారుదల విధానాలను అమలు చేయడం ద్వారా శాస్త్రీయ నీటి నిర్వహణ చేపట్టాలని మంత్రి సూచించారు. అత్యవసర విత్తనాలు, సూక్ష్మ పోషకాలు, ఆకులపై పిచికారీ చేసే పోషకాలు మరియు తక్కువ ఖర్చుతో లభించే యాంటీ-ట్రాన్స్‌పిరెంట్లు సహా అవసరమైన వ్యవసాయ ఉత్పాదకాలను సకాలంలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కరువును తట్టుకునే విత్తనాలు, బిందు సేద్యం, మల్చింగ్, వ్యవసాయ చెరువులు, వ్యవసాయ యాంత్రీకరణ వంటి వాతావరణ మార్పులను తట్టుకునే సాంకేతిక పరిజ్ఞానాలకు లక్ష్యిత రాయితీలు అందించాలని మంత్రి తెలిపారు. ప్రతి వారం జిల్లా సమీక్ష కమిటీ సమావేశాలు నిర్వహించడం, పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించడం ద్వారా జిల్లాస్థాయి పర్యవేక్షణను బలోపేతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, డైరెక్టర్ మంజీర్ జిలాని, రైతు సాధికారిక సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, 28 జిల్లాల డీఏవోలు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి బీజేపీ కార్యకర్త సిద్ధం కావాలి



- **తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ సంస్థాగత సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మేకల హనుమంతరావు పిలుపు**

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మేకల హనుమంతరావు పిలుపునిచ్చారు. గుంటూరులోని కొత్తపేట ఫ్యాన్సీ మర్చంట్స్ కళ్యాణమండపంలో ఆదివారం తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ సంస్థాగత సమావేశం బీఎల్ఏ-1 చరక కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మేకల హనుమంతరావు మాట్లాడుతూ పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయి విస్తరణ, గుంటూరు నగరంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి తరఫున బీజేపీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త ఇప్పటి నుంచే ఎన్నికల కార్యాచరణలో నిమగ్నం కావాలని అన్నారు.

పార్టీలో పదవి ఉన్నా లేకపోయినా ప్రతి కార్యకర్త ప్రజల మధ్య ఉంటూ సేవాభావంతో పనిచేయాలని, అవసరమైతే పార్టీ అభ్యర్థిగా పోటీ చేసే స్థాయికి తనను తాను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పార్టీ అప్పగించే ప్రతి బాధ్యతను క్రమశిక్షణ, అంకితభావంతో నిర్వహించడమే నిజమైన కార్యకర్త లక్షణమని పేర్కొన్నారు.

బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ ప్రతి బూత్‌లో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కొత్త నాయకత్వాన్ని తీర్చిదిద్దాలని అన్నారు. యువత, మహిళలు, రైతులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సహా అన్ని వర్గాల ప్రజలను పార్టీతో అనుసంధానం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.

జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేయాలని, ప్రజా విశ్వాసాన్ని ఓట్లుగా మలిచేలా ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని కోరారు.

సమావేశంలో బీజేపీ నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి భీమినేని చంద్రశేఖర్, నేరెళ్ల మాధవరావు, డాక్టర్ ఉమాశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు సాధు రామకృష్ణ, కత్తి మేరీ సరోజినీ, జిల్లా కార్యదర్శి సురేష్ జైన్, బీజేవైఎం అధ్యక్షుడు తుంగా యశ్వంత్, మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ రాధా మాధవి, తూర్పు అసెంబ్లీ పరిధిలోని మండల అధ్యక్షులు, మండల పదాధికారులు, మండల ఇన్‌చార్జీలు, మోర్చాల అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, శక్తి కేంద్ర ప్రముఖులు, పోలింగ్ బూత్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రైవేటు ఆపరేటర్లకు ఎలక్ట్రిక్ బస్సులు అప్పగించొద్దు: ఆర్టీసీ ఉద్యోగుల జేఏసీ

- **27న కలెక్టర్ల ద్వారా సీఎంకు ఉద్యోగుల సంతకాలతో వినతిపత్రాలు**
- **30న రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా నడిపే విధానాన్ని విరమించుకుని, ఆర్టీసీ ద్వారానే బస్సులను కొనుగోలు చేసి, ఆర్టీసీ ఉద్యోగులతోనే నిర్వహించాలని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ల ద్వారా ముఖ్యమంత్రికి వేలాది మంది ఆర్టీసీ ఉద్యోగుల సంతకాలతో కూడిన వినతిపత్రాలను సమర్పించనున్నట్లు జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు వెల్లడించారు.

ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ, ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలంటే ఆర్టీసీని బలహీనపరిచే నిర్ణయాలకు బదులుగా కొత్త బస్సుల కొనుగోలు, ఖాళీ పోస్టుల భర్తీ వంటి చర్యలు ప్రభుత్వం చేపట్టాలని కోరారు. ప్రజల ఆస్తి అయిన ఆర్టీసీని ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే ఎలాంటి ప్రయత్నాన్నైనా ఉద్యోగ సంఘాల జేఏసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.

జూలై 20 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఉద్యోగుల సంతకాల సేకరణ కార్యక్రమానికి అన్ని విభాగాల ఉద్యోగులు విశేష స్పందన తెలియజేయడం ఆర్టీసీ పరిరక్షణపై ఉద్యోగుల్లో ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.

ఈ నెల 30న విజయవాడలో జరిగే ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రభుత్వ స్పందనను సమీక్షించి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై కీలక నిర్ణయాలు ప్రకటించనున్నట్లు జేఏసీ కో-కన్వీనర్లు పి.వి. రమణారెడ్డి, జి.వి. నరసయ్య, సి. హెచ్. సుందరయ్య, కట్టా సుబ్రహ్మణ్యం, ఎస్.వి. శేషగిరిరావు, కె. సూర్యప్రకాశరావు, డి. మాల్యాద్రి తెలిపారు.

# టీచర్లకు టెట్ పరీక్షకు ఓడీ సౌకర్యం కల్పించాలి

- **టీఎన్‌యూఎస్**

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** ఆగస్టు 5 నుంచి 21 వరకు నిర్వహించనున్న ఏపీ టెట్-జూన్ 2026 పరీక్షలకు హాజరయ్యే ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ (ఓడీ) సౌకర్యం కల్పించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ను కోరారు.

ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలను సాధించేందుకు విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు టెట్ పరీక్షకు హాజరవుతున్న నేపథ్యంలో, పరీక్ష జరిగే రోజున వారికి ఓడీ మంజూరు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఏకరీతి ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ఉపాధ్యాయులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

# గ్రీన్ గుంటూరు - నవ గుంటూరు

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరాన్ని హరిత నగరంగా తీర్చిదిద్దుటకు జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. గుంటూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుటకు, పచ్చదనం పరిఢవిల్లుటకు చర్యలు చేపట్టారు. ఆహ్లాదకర వాతావరణం కల్పించుటమే కాకుండా ఈ చర్యలు వలన గాలి, వాతావరణ నాణ్యతలు పెరుగుటకు దోహదం చేస్తుంది. ఇందులో భాగంగా "గ్రీన్ గుంటూరు" - "నవ గుంటూరు" అనే వినూత్న కార్యక్రమానికి శనివారం నాంది పలికారు. నగరంలో ఇన్నర్ రింగ్ రోడ్ లో శిల్పారామం దగ్గర "నవ గుంటూరు", "గ్రీన్ గుంటూరు" కార్యక్రమ ప్రారంభ సూచికంగా మొక్కలు నాటారు. ఇందులో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రస్తుతం గుంటూరు ప్రాంతంలో కేవలం 7.2 శాతం మాత్రమే పచ్చదనం ఉంది. పరిస్థితిలో మార్పు తీసుకువచ్చి గుంటూరును హరితమయంగా మార్చేందుకు ఇది ఉపయోగపడుతుంది. "గ్రీన్ గుంటూరు" - "నవ గుంటూరు" ప్రణాళికలో భాగంగా గుంటూరు పార్లమెంట్ పరిధిలో 1.20 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ స్థానిక సంస్థలు, పంచాయతీ, జెడ్పీ నిధులతో పాటు సీఎస్ఆర్, వివిధ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో నిధులు సమకూర్చి మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది. ప్రధాన రహదారులకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్, చెరువు గట్లు మీద, ఖాళీ స్థలాలలో బ్లాక్ ప్లాంటేషన్ ద్వారా వాతావరణానికి అనుకూలమైన మొక్కలను పెంచుటకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆగస్టు 15 నాటికి ఈ లక్ష్యాన్ని పూర్తి చేయడానికి అధికార యంత్రాంగం సిద్ధం అయింది. గుంటూరు నగర పాలక సంస్థ తరపున అదనంగా మరో 5 వేల మొక్కలను ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించారు. మొక్కలు నాటడమే కాకుండా, వాటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అవసరమయ్యే 90 వేల మొక్కలకు ట్రీ గార్డ్స్‌ను ఏర్పాటు చేయుటకు నిర్ణయించారు. నాటిన ప్రతి మొక్క సురక్షితంగా పెరిగేలా, ఎదిగే అవకాశం ఎక్కువగా ఉండే 3 అడుగుల ఎత్తు ఉన్న




మొక్కలను ఎంచుకోవడంతో పాటు, వాటికి జియో-ట్యాగింగ్ చేసి మొబైల్ యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షించేలా కచ్చితమైన సాంకేతిక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు.

"వెల్త్ ఫ్రమ్ వేస్ట్" (చెత్త నుండి సంపద) విధానంలో భాగంగా నగరంలో చెత్త నుంచి తయారుచేసిన కంపోస్ట్ ఎరువును ప్రస్తుతం నాటుతున్న మొక్కలకు ఉపయోగించుటకు ఉపక్రమిస్తున్నారు.

పచ్చదనంతో పాటు నగరంలో స్వచ్ఛతను పెంపొందించేందుకు 'నవ గుంటూరు' కార్యక్రమంలో భాగంగా గుంటూరును దేశంలోనే అత్యుత్తమ నగరాలలో ఒకటిగా, స్మార్ట్, క్లీన్, బ్యూటిఫుల్, క్లైమేట్ రెసిలియంట్ సిటీగా తీర్చిదిద్దడమే ప్రధాన ధ్యేయంగా రూపకల్పన చేశారు. "మిషన్ జీరో ప్లాస్టిక్" కార్యక్రమాన్ని, ఆగస్ట్ 15వ తేదీ నుంచి అమలుకు చర్యలు చేపట్టారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ సంచులు) వాడినా లేదా రోడ్లపై చెత్త వేసినా జరిమానాలు విధించే విధానాన్ని ప్రారంభించనున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై కఠిన చర్యలు తీసుకుంటూ, రోడ్లపై ప్లాస్టిక్ చెత్తను అరికట్టేందుకు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, గ్లాస్ బాటిళ్లను ప్రోత్సహించుటకు కార్యాచరణ తయారు చేశారు. ఇందుకు ప్రత్యేక అవగాహన, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి స్వర్ణ వార్డు కార్యాలయం (సచివాలయం) లో ఒక 'గ్రీన్ అంబాసిడర్' లేదా 'గ్రీన్ వాలంటీర్'ను నియమించుటకు యోచిస్తున్నారు. నగరాన్ని మరింత సుందరంగా మార్చేందుకు రోడ్డు డివైడర్లలో ప్లాంటేషన్ చేయనున్నారు. రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడానికి స్వీపింగ్ మిషన్లను ఇప్పటికే ప్రభుత్వం సరఫరా చేసింది. ఖాళీగా ఉన్న స్థలాలను నగరవాసులకు ఉపయోగపడేలా పార్కులుగా, ఆహ్లాదకరమైన ప్రదేశాలుగా మార్పు చేయడం జరుగుతుంది. గోడలపై పోస్టర్లు అంటించే సంస్కృతికి స్వస్తి పలికి వాటి స్థానంలో అందమైన, ఆలోచనలకు అద్దంపట్టే పెయింటింగ్స్ వేయుటకు ప్రణాళికలు రూపొందించారు. వివిధ జంక్షన్ లను సుందరంగా మలిచే చర్యలు చేపట్టారు. గుంటూరులో "స్ట్రీట్ ఆర్ట్ ఫెస్టివల్" కూడా నిర్వహించుటకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నగరం ఆహ్లాదకర, అందమైన వాతావరణానికి నిలయం కావడమే కాకుండా నగరంలో మౌలిక వసతుల కల్పన జరిగి, రాబోయే 30 సంవత్సరాల నీటి అవసరాలను తీర్చేందుకు రూ. 557 కోట్ల వ్యయంతో భారీ తాగునీటి ప్రాజెక్టును కూడా శ్రీకారం చుట్టారు. వచ్చే 5 నుండి 10 సంవత్సరాల కాలంలో గుంటూరు నగరం నాణ్యమైన రహదారులు, కాలువలు, తాగు నీరు, పచ్చదనంతో సమగ్రంగా అభివృద్ధి చేసి 'వికసిత్ భారత్' ప్రమాణాలకు తగ్గట్టుగా ఉండేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేస్తున్నారు.

2047 నాటికి దేశంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా గుంటూరు నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్ర శేఖర్ తెలిపారు.

జాతీయ, అంతర్జాతీయ నగరాలను సందర్శించడం జరిగింది. మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ కమిషనర్ గా పని చేసిన అనుభవంతో గుంటూరు నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా గుంటూరు నగరానికి అంతర్జాతీయ నగరాల స్థాయిలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, పచ్చదనం, పరిశుభ్రంతో సుందరమైన, ఆహ్లాదకర నగరంగా తీర్చిదిద్దుటకు చర్యలు చేపట్టామని, నగర పౌరులు పూర్తి భాగస్వామ్యమై ఆశయాల సాధనకు సహకరించాలని జిల్లా కలెక్టర్ మరియు నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి సి. యం. సాయికాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు.

# చేనేతకు పునర్వైభవం తీసుకురావాలి

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**
- **ప్రగడ కోటయ్య జయంతి నిర్వహణ స్వాగతం.. ఆగస్టు 5న రాష్ట్రవ్యాప్త చేనేత సదస్సు**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** చేనేత రంగం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, అది భారతీయ సంస్కృతి, స్వావలంబన, ఆర్థిక స్వాభిమానానికి ప్రతీక అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో చేనేత అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో ఓబిసి మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీ నివాస్ అధ్యక్షత వహించారు సమావేశంలో మాధవ్ కీలక అంశాలు ప్రస్తావించారు చేనేత రంగానికి విశిష్ట సేవలందించిన స్వర్గీయ ప్రగడ కోటయ్య జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం స్వాగతించదగ్గ పరిణామమని ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ స్వాగతించారు. చేనేత కార్మికుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడు ప్రగడ కోటయ్య అని మాధవ్ కొనియాడారు.

భారతదేశం ఒకప్పుడు ప్రపంచానికి వస్త్రాలను ఎగుమతి చేసి "బంగారు పిట్ట"గా ఎదగడానికి చేనేత రంగమే ప్రధాన ఆధారమని మాధవ్ గుర్తు చేశారు. సింధు లోయ నాగరికత కాలం నుంచే భారతీయ వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా విశిష్ట గుర్తింపు ఉండేదని, రోమన్, ఈజిప్ట్, గ్రీక్ వంటి దేశాలు భారతీయ వస్త్రాలకు బదులుగా బంగారం చెల్లించేవని చెప్పారు. అయితే బ్రిటిష్ పాలకులు తమ మిల్లు వస్త్రాల వ్యాపారం కోసం భారత చేనేత వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేశారని విమర్శించారు.

స్వదేశీ ఉద్యమంలో మహాత్మా గాంధీజీ చేనేతను స్వాతంత్ర్య సమరానికి శక్తివంతమైన ఆయుధంగా మలిచారని పేర్కొన్నారు. ప్రతి భారతీయుడు చేనేత వస్త్రాలను వినియోగించడం ద్వారా మన సంప్రదాయాన్ని, చేనేత కార్మికుల శ్రమను గౌరవించాలని పిలుపునిచ్చారు.

ప్రధాని నరేంద్ర మోదీ 2015లో ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించడం ద్వారా చేనేత రంగానికి కొత్త ఊపు వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం "వోకల్ ఫర్ లోకల్", "ఆత్మనిర్భర్ భారత్" వంటి కార్యక్రమాల ద్వారా చేనేత ఉత్పత్తులకు ప్రాధాన్యం కల్పిస్తోందని చెప్పారు.

రాష్ట్రంలో చేనేత కార్మికులకు విద్యుత్, నూలు, రంగుల సబ్సిడీలను పారదర్శకంగా అందించాలని, పెన్షన్, సంక్షేమ పథకాలు, ఉచిత విద్యుత్ వంటి హామీలను నిరంతరంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. శ్రీకాకుళం జిల్లాలోని పొందూరు ఖాదీకి లభించిన అంతర్జాతీయ గుర్తింపు రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు.

చేనేత రంగాన్ని ఆధునిక మార్కెటింగ్, ఈ-కామర్స్, ఎగుమతులతో అనుసంధానం చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మార్కండేయ జయంతిని అధికారికంగా నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయం చేనేత సమాజానికి గౌరవప్రదమైనదని పేర్కొన్నారు. ఆగస్టు 5న విజయవాడలో నిర్వహించే రాష్ట్రవ్యాప్త చేనేత సదస్సు ద్వారా రంగ అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని మాధవ్ సూచించారు. చేనేత కార్మికుల సంక్షేమం, ఉత్పత్తుల ప్రోత్సాహం, ప్రపంచ మార్కెట్లలో గుర్తింపు పెంపు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్ర శివ నారాయణ, ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు అడ్డూరి శ్రీ రాం, చేనేత సంఘాల నేతలు పుచ్చల రామకృష్ణ జ్వాల నరసింహారావు, ఘనప వీరేశ శెట్టి సత్తి త్యాగరాజు మండి వీరాంజనేయులు, బిజెపి నేత కనిగిరి నీలకంఠం, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి చంద్రిక చికిత్సపై మంత్రి సత్యకుమార్ నిరంతర పర్యవేక్షణ



- **వైద్యుల సిఫార్సు మేరకు తిరుపతి నుంచి హైదరాబాద్‌కు తరలింపు..**
- **ఇండో - అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ కి వెళ్లి బాలికను పరామర్శించిన మంత్రి సత్యకుమార్**
- **ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత వైద్యానికి ఆదేశాలు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అన్నమయ్య జిల్లా ములకలచెరువుకు చెందిన ఆరేళ్ల చిన్నారి ఎస్. చంద్రిక చికిత్స విషయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మొదటి నుంచే ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఈ క్రమశీ లోనే హైద్రాబాద్ లోని ఇండో అమెరికన్ హాస్పిటల్లో చేరిన బాలికను ఆదివారం పరామర్శించి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. చంద్రిక కు రెండు రోజుల్లో శస్త్ర చికిత్స ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున జరగనుంది. ఈ నెల 4న చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై సమాచారం అందిన వెంటనే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి.. చిన్నపిల్లల వైద్య నిపుణులు, నేత్ర వైద్యులు తదితరులతో కూడిన బృందాన్ని నేరుగా ఆమె ఇంటికి పంపించి పరీక్షలు నిర్వహింపజేశారు. బాలిక లక్షణాలు, కుటుంబ వైద్య చరిత్రను పరిశీలించిన వైద్యులు ప్రాథమికంగా జెరోడెర్మా పిగ్మెంటోసమ్ అనే అరుదైన జన్యుపరమైన వ్యాధి అయి ఉండొచ్చని అభిప్రాయపడటంతో, మంత్రి ఆదేశాల మేరకు ప్రత్యేక అంబులెన్స్‌లో వెంటనే తిరుపతి రూయా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**తిరుపతిలో... :** రూయా ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్య నిపుణులు, చర్మవ్యాధి నిపుణులు, నేత్ర వైద్యులు, ఆంకాలజిస్టులు కలిసి చంద్రికకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. కంటి సమీపంలో ఉన్న గాయం, వాపుపై బయాప్సీతో పాటు ఇతర వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మరింత ఉన్నత స్థాయి చికిత్స అవసరమని వైద్యులు సూచించడంతో, వారి సిఫార్సు మేరకు హైదరాబాద్‌లోని బసవ తారకశీ ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ లో చికిత్స అందేలా మంత్రి సత్యకుమార్ చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఆసుపత్రి లో చేరిన చిన్నారిని ఆదివారం మంత్రి సత్యకుమార్ స్వయంగా వెళ్లి పరామర్శించారు. చంద్రిక ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆధునిక వైద్య సేవలు అందించాలని వారిని కోరారు. చిన్నారి చికిత్సకు తక్షణ అవసరం కింద డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా రూ. 1,37,339 విలువైన వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందించాలని హైదరాబాద్ జిల్లా కోఆర్డినేటర్ రంగాస్వామిని ఆదేశించారు. అధిక ఆరోగ్య పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు తెలియజేయాలని మంత్రి రంగస్వామికి స్పష్టం చేశారు

**హైదరాబాదులో.:** చికిత్సకు సంబంధించిన ఇతర అవసరాల కోసం ఆర్థిక సాయం అందించిన మంత్రి.. చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పౌష్టికాహార కిట్‌ను అందజేశారు. అనంతరం తల్లిదండ్రులతో మాట్లాడి, లిలి"మీరు అధైర్యపడొద్దు.. చికిత్స విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తాం" అని భరోసా ఇచ్చారు.

చంద్రిక ఆరోగ్య సమస్య వెలుగులోకి వచ్చిన నాటి నుంచి ఇంటి వద్ద ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించడం, తిరుపతి రూయాలో నిపుణులతో ప్రత్యేక పరీక్షలు చేయించడం, వైద్యుల సిఫార్సు మేరకు హైదరాబాద్‌లో అత్యాధునిక చికిత్స అందేలా చూడడం, ప్రస్తుతం ఆస్పత్రికి వెళ్లి స్వయంగా చికిత్సను సమీక్షించడం వరకు ప్రతి దశలోనూ మంత్రి సత్యకుమార్ వ్యక్తిగతంగా చొరవ చూపడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో చిన్నారి కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, మంత్రి సత్యకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఓబీసీల సాధికారతే బీజేపీ లక్ష్యం

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని అన్ని మోర్చాల్లో భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా అత్యంత కీలకమైన బాధ్యతను నిర్వహిస్తోందని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రంగుల గోపి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన ఓబీసీ మోర్చా రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులను అభినందించిన పీవీఎన్ మాధవ్, రాష్ట్రంలోని అన్ని బీసీ కులాలను ఒకే వేదికపైకి తీసుకురావడంతో పాటు భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రతి బీసీ కుటుంబానికి చేరవేయాలని పిలుపునిచ్చారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటి ప్రయోజనాలు చివరి లబ్ధిదారునికి చేరేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు.

వివిధ బీసీ వర్గాల సంప్రదాయ వృత్తులకు గౌరవం దక్కేలా, ఆయా వర్గాల కులదేవతలు, మహనీయులను స్మరించుకునే కార్యక్రమాలను నిర్వహించాలని మాధవ్ సూచించారు. సమాజంతో మరింత అనుబంధాన్ని పెంపొందించేలా ఓబీసీ మోర్చా కార్యాచరణ ఉండాలని చెప్పారు.

ఈ సందర్భంగా రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేస్తూ బీజేపీని మరింత బలోపేతం చేయాలని అన్నారు. పార్టీ అప్పగించే బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించడం ప్రతి కార్యకర్త కర్తవ్యమని పేర్కొన్నారు.

రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రంగుల గోపి శ్రీనివాస్ మాట్లాడుతూ, పార్టీ కార్యక్రమాలతో పాటు సమాజానికి ఉపయోగపడే వినూత్న కార్యక్రమాలను ప్రతి కార్యకర్త స్వచ్ఛందంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి ఓబీసీ వర్గాలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ, బడుగు, బలహీన వర్గాలతో కలిసి పనిచేస్తూ పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని అన్నారు.


ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు విజయ్ కుమార్, బండి ఆనంద్, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బలివాడ శివకుమార్ పట్నాయక్, జోనల్ ఇన్‌చార్జులు, రాష్ట్ర పదాధికారులు, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్గిల్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- **బీజేపీ నాయకులు**
- **పుల్లడిగుంటలో బీజేవైఎం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహణ**

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కార్గిల్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి వీరగాథలను ప్రతి భారతీయుడు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని భారతీయ జనతా పార్టీ నాయకులు పేర్కొన్నారు. భారతీయ జనతా యువమోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షుడు తుంగ యశ్వంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాయతి ప్రదీప్ సంయుక్త ఆధ్వర్యంలో పుల్లడిగుంటలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళులర్పించి వారి త్యాగాలను స్మరించుకున్నారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ, భారత సైనికుల త్యాగాల వల్లే దేశ ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని అన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన ప్రతి సైనికుడి విజయగాథను ప్రతి పౌరుడు తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్య వక్తగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ, 1999 కార్గిల్ యుద్ధంలో భారత భూభాగాన్ని ఆక్రమించాలనే ఉద్దేశంతో పాకిస్తాన్ సైన్యం చొరబడగా భారత సైనికులు అసాధారణ ధైర్యసాహసాలతో వారిని తరిమికొట్టారని తెలిపారు. ఈ యుద్ధంలో 500 మందికిపైగా భారత జవాన్లు ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాలను దేశం ఎన్నటికీ మరవదన్నారు. కళాశాల విద్యార్థులు దేశసేవకు ముందుకు రావాలని, దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. నీట్ పరీక్ష అంశాన్ని అడ్డుపెట్టుకుని యువతను రెచ్చగొట్టే దేశ వ్యతిరేక శక్తుల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని, యువత దేశాభివృద్ధికి తోడ్పడినప్పుడే ప్రధానమంత్రి లక్ష్యంగా పెట్టుకున్న "వికసిత్ భారత్" సాకారమవుతుందని పేర్కొన్నారు.




ఈ కార్యక్రమంలో బీజేవైఎం ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షులు కొచ్చర్ల శ్రీదుర్గా, బాలకోటయ్య, కార్యదర్శి రాధాకృష్ణ, కార్యవర్గ సభ్యులు సురేంద్ర, మధు, బీజేపీ ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య పరికరాల దేశీయ తయారీ కోసం కేంద్రం భారీ ప్రోత్సాహకాలు

**: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తో కేంద్రమంత్రి నడ్డా**



**ఢిల్లీ, ఏలూరు,** జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) : అత్యాధునిక, నాణ్యమైన ముఖ్య వైద్య పరికరాల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకొని దేశీయంగా ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. మెడిటెక్ పార్కుల కోసం, వైద్య పరికరాల దేశీయ తయారీ కోసం, కేంద్రం అందిస్తున్న ప్రోత్సాహకాల వివరాలపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు శుక్రవారం లోక్ సభలో కేంద్ర మంత్రి జేపీ నడ్డా సమాధానం ఇచ్చారు. ముఖ్యంగా, ప్రొడక్షన్ లింక్ ఇన్సెంటివ్ స్కీమ్ ఫర్ మెడికల్ డివైసెస్ (పిఎల్ఐ) , స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ మెడికల్ డివైస్ పార్క్స్, స్కీమ్ ఫర్ స్ట్రెంగ్తనింగ్ ఆఫ్ మెడికల్ డివైస్ ఇండస్ట్రీ (ఎస్ఎం డిఐ ) పేర్లతో మూడు పథకాలను తీసుకొచ్చి కీలక ఆధునిక వైద్య పరికరాలను దేశీయంగా తయారు చేసే సంస్థలకు భారీగా ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. క్యాన్సర్ సంరక్షణ/రేడియోథెరపీ, రేడియాలజీ మరియు ఇమేజింగ్, అనస్థీటిక్స్/కార్డియో-రెస్పిరేటరీ/రీనల్-కేర్ పరికరాలు మరియు ఇంప్లాంట్లు అనే నాలుగు లక్ష్య విభాగాలలో అర్హత కలిగిన అదనపు అమ్మకాలపై కూడా ప్రోత్సాహకాలను అందిస్తున్నామన్న కేంద్ర మంత్రి, ఎం ఆర్ ఐ, సిటి స్కాన్ పరికరాలు, లినాక్‌లు, మామోగ్రఫీ సిస్టమ్‌లు, సి-ఆర్మ్‌లు, అల్ట్రాసౌండ్ పరికరాలు, గుండె కవాటాలు మరియు స్టెంట్ల వంటి ఉత్పత్తుల దేశీయ తయారీ ఇప్పటికే ప్రారంభమైనట్లు వివరించారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి మార్జినల్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్ (ఎం ఐఎస్- ఆర్ ఐడి) కూడా అమలు చేస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రి తెలిపారు. మెడ్ టెక్ పార్కుల పురోగతిపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి నడ్డా సమాధానం ఇస్తూ.. మెడ్ టెక్ పార్కుల లలో మౌలిక సదుపాయాలకోసం, ఒక్కో పార్కుకు 100 కోట్ల వరకు కేంద్ర సహాయం అందించినట్లు తెలిపారు. 2021-22 నుండి ల 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు మెడిటెక్ పార్కులకు రూ.17,201 కోట్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయని (ఎఫ్ డిఐ ) ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జేపీ నడ్డా వెల్లడించారు.

## ఘనంగా వైసీపీ సీఈసీ సభ్యులు, నదీమ్ అహ్మద్ జన్మదిన వేడుకలు



**అనంతపురం,** జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీఈసీ సభ్యులు, అనంతపురం అర్బన్ మాజీ సమన్వయకర్త నదీమ్ అహ్మద్ జన్మదిన వేడుకలు నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న మీనాక్షమ్మ సమ్మిళిత వికాస కేంద్రంలో అరవింద్ నగర్ లో గల వృద్ధాశ్రమంలో నదీమ్ అహ్మద్ టీమ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా అక్కడ నివసిస్తున్న దివ్యాంగుల సమక్షంలో నదీమ్ అహ్మద్ జన్మదినంసందర్భంగా కేక్ కట్ చేసి, అనంతరం వారికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలోని బలహీన వర్గాల పట్ల సేవా దృక్పథంతో జన్మదినాన్ని జరుపుకోవడం అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అనంతపురం అర్బన్ సమన్వయకర్తగా నదీమ్ అహ్మద్ పనిచేసిన కాలంలో పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో పార్టీ సంస్థాగతంగా మరింత బలపడిందని, ఆయన నియమించిన అనేక మంది నాయకులు గత మున్సిపల్ ఎన్నికల్లో విజయాలు సాధించి ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. అలాగే, 2029 లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడబోయే ప్రజా ప్రభుత్వంలో నదీమ్ అహ్మద్ మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ నాయకులు గోపినాథ్ యాదవ్, బీసీ సంఘం విద్యార్థి నాయకులు కేశవ్ గౌడ్, కమ్మూరు నిజాముద్దీన్, ముహెబ్, మహబూబ్ భాషా, ఐబీ ఖాన్, చాంద్, యూనస్, ఉమా శంకర్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు




**అనంత పురం బ్యూరో** జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) : రామ్‌నగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో ముందస్తుగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు అనంతపురం రామ్‌నగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్లో కార్గిల్ విజయ్ దివస్‌ను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆర్మీ దుస్తులు ధరించి కార్యక్రమంలో పాల్గొని దేశభక్తిని చాటిచెప్పారు. 1999లో కార్గిల్ యుద్ధంలో విజయం సాధించిన భారత సైనికులకు నివాళులర్పిస్తూ సెల్యూట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సరిత రెడ్డి విద్యార్థులకు భారత సైనికుల ధైర్యసాహసాలు, దేశ రక్షణలో వారు చేస్తున్న సేవలు , కార్గిల్ విజయ్ దివస్ ప్రాముఖ్యత గురించి వివరించారు. పాఠశాల చైర్మన్ దాదా గాంధీ కార్గిల్ యుద్ధం విశిష్టతను, భారత సైనికుల త్యాగాలను విద్యార్థులకు వివరించి దేశభక్తి భావాన్ని పెంపొందించారు. అలాగే ఉపాధ్యాయులు విద్యార్థులతో సరిహద్దుల్లో భారత సైనికులు ఎలా దేశాన్ని కాపాడుతారో చిత్రలేఖనం ద్వారా వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయంలో వైభవంగా నామ సప్తాహం

**101 కలశాలతో కాశీ విశ్వేశ్వరునికి ప్రత్యేక అభిషేకం**

యాడికి, జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) :



మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో గల శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఈ నెల 23వ తేదీ నుండి 30వ తేదీ వరకు వరుణ దేవుని కటాక్షం కోసం ప్రారంభమైన నామ సప్తాహ ఉత్సవాలు భక్తిపారవశ్యం నడుమ వైభవంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మూడో రోజు ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్ప స్వామివారికి నిత్యాభిషేకం, మహాగణపతి హోమం, శరణుఘోష, నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. స్వామివారికి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, విశేష పుష్పాలతో అలంకరణలు చేసి, శోభాయమానంగా పూజాధిపతులు నిర్వహించారు. సాయంత్రం 6:30 గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ శ్రీ కాశీ విశ్వేశ్వర లింగానికి 101 కలశాలతో అంగరంగ వైభవంగా అభిషేక మహోత్సవం జరిపారు. అనంతరం భక్తులకు స్వామివారి దివ్య దర్శనం కల్పించి, ప్రత్యేక తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ భక్తివర్ధక కార్యక్రమంలో అశేష సంఖ్యలో భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి బి. హరినాథ్ బాబు, ఆలయ ప్రెసిడెంట్ టి. నాగరాజు, గొందిపల్లె రామాంజనేయులు, వొడాఫోన్ నరేష్, సోమశేఖర్ రెడ్డి మరియు చిట్టి గురుస్వామి తదితరులు పాల్గొన్నారు...

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) తొలి దశ పూర్తయింది

**-జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ - - అక్టోబర్ 3న తుది జాబితా విడుదల-ముసాయిదా జాబితాపై ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు-పాత్రికేయుల సమావేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వివరాలను వెల్లడించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**




**మచిలీపట్నం,** జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) : కృష్ణా జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్--స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) కార్యక్రమంలో తొలి దశ విజయవంతంగా పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 15,43,242 మంది ఓటర్లు ఉండగా, వారిలో 14,05,580 మంది నుంచి ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి అందాయని తెలిపారు. మిగిలిన 1,37,662 ఫారాలు తిరిగి అందకపోవడంతో వాటిని అన్‌కలెక్టబుల్ కింద నమోదు చేసినట్లు చెప్పారు. అన్‌కలెక్టబుల్‌గా నమోదైన వారిలో 56,346 మంది మరణించినవారు, 24,603 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారినవారు, 34,650 మంది ఇప్పటికే ఇతర చోట్ల నమోదు కావడంతో డూప్లికేట్‌గా గుర్తించినవారు, 21,970 మంది ఇంటి వద్ద అందుబాటులో లేని వారు, 93 మంది ఇతర కారణాల కింద నమోదైనట్లు వివరించారు. మొత్తం ఓటర్లలో 8.92 శాతం అన్‌కలెక్టబుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. జూలై 31న ప్రచురించనున్నది ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితా మాత్రమేనని, ఇది బీఎల్ఓలు ఇంటింటి సర్వే ఆధారంగా రూపొందించిన ప్రాథమిక జాబితా అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ జాబితాలో పేరు లేకపోయిన వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఫారం--6 ద్వారా పేరును చేర్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని, అనంతరం సంబంధిత వారికి నోటీసులు జారీ చేసి, వారి వాదనలు, సమర్పించిన పత్రాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అన్ని ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని చెప్పారు. ఇప్పటికే డిజిటైజ్ చేసిన 14,05,580 ఎన్యూమరేషన్ ఫారాల్లో, 13,82,660 మంది ఓటర్ల వివరాలు 2002 ఓటర్ల జాబితాలో ఉన్న వారి పేర్లు, తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మ/నానమ్మ పేర్లతో విజయవంతంగా మ్యాపింగ్ అయినట్లు తెలిపారు. వీరికి ఎలాంటి నోటీసులు జారీ చేయబోమని స్పష్టం చేశారు. నో మ్యాపింగ్' కింద గుర్తించిన వారికి మాత్రమే నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. వారికి అవసరమైన పత్రాల జాబితాలో కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, బ్యాంకులు, పోస్టాఫీసులు, ఎల్ఐసీ, ప్రభుత్వ రంగ సంస్థలు జారీ చేసిన గుర్తింపు కార్డులు లేదా ధ్రువపత్రాలు, జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం, అటవీ హక్కుల ధ్రువీకరణ పత్రం, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ తదితర కుల ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ రిజిస్టర్, ప్రభుత్వం జారీ చేసిన భూమి లేదా గృహ కేటాయింపు పత్రాలు వంటి 11 రకాల పత్రాలు ఉన్నాయని తెలిపారు. 1987 జూలై 1కు ముందు జన్మించిన వారు తమకు సంబంధించిన ఏదైనా ఒక పత్రం సమర్పిస్తే సరిపోతుందని, 1987 జూలై 1 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య జన్మించిన వారు తమ పత్రంతో పాటు తల్లిదండ్రుల్లో ఒకరి పత్రం సమర్పించాలని, 2004 డిసెంబర్ 2 తర్వాత జన్మించిన వారు తమ పత్రాలతో పాటు ఇద్దరు తల్లిదండ్రుల పత్రాలు సమర్పించాలని వివరించారు. ఈ ప్రక్రియలో ప్రతి ఓటరికి పూర్తి సహకారం అందించేలా బీఎల్ఓలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని, ప్రజలకు అవసరమైన మార్గదర్శకత్వం అందించి, ఎవరికీ ఇబ్బందులు కలగకుండా అవసరమైన పత్రాలు సేకరించే చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. పాత్రికేయుల సమావేశంలో ఇన్చార్జి డిఆర్ఓ ఎస్ పోతురాజు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి సందర్భంగా కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకున్న 'రుడా' చైర్మన్ 'బొడ్డు



**కోరుకొండ,** జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి శనివారం కోరుకొండలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ బొడ్డు వెంకటరమణ చౌదరికి పూర్ణకుంభ స్వాగతం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరికీ తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాష్ట్రంలో సుఖశాంతులు, సుభిక్షం నెలకొనాలని, రైతాంగం పాడిపంటలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## మహిళల పై జరుగుతున్న మోసాలపట్ల అప్రమత్తం గా ఉండాలి.సి ఐ. గోపాలకృష్ణ



చింతూరు() మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, మొబైల్లో వచ్చే మెసేజ్ మోసాల పట్ల, అప్రమత్తంగా ఉండాలని చింతూరు సిఐ గోపాలకృష్ణ పేర్కొన్నారు. మహిళల భద్రత గూర్చి అవగాహన సదస్సును కన్నాపురం గ్రామం లో నిర్వహించారు. పోలీసువున్నతాధికారులైన జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, ఎఎస్పీ హేమంత్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం కన్నాపురం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మొబైల్ వాడకం పెరిగిన ప్రతి మోసాలు పెరుగుతున్నాయని మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. మహిళలను ఎవరైనా ఈవ్ టీజింగ్ చేస్తే 112 నెంబర్ కు కాల్ చేయాలన్నారు. విద్యార్థినులు శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. మొబైల్ లో డిజిటల్ అరెస్ట్ చేశామని మొబైల్ వాడకం దారులకు అక్రమ కాల్స్ వస్తుంటాయని, అలాంటి అరెస్టులు ఏమి ఉండవని, ఆ విధమైన కాల్స్ వస్తే వెంటనే తమకు తెలపాలని కోరారు. అలాగే యువతను ఉద్దేశించి చెడు వ్యసనాలపై అవగాహన కల్పించారు. బహిరంగంగా మద్యం సేవించడం కూడా నేరమేనన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచి బహిరంగంగా మద్యం సేవించే వారిని కనుగొని కేసులు పెడతామని, వదిలిపెట్టేది లేదని, అలాగే అతివేగంగా వాహనాలు నడపటం, లైసెన్సు లేకుండా వాహనాలు నడపటం, ద్విచక్ర వాహనంపై ముగ్గురు నలుగురు కూర్చోని ప్రయాణించటం నేరం అన్నారు. వాహన యజమానులు తమ మైనర్ బాల బాలికలకు వాహనాలు నడపటానికి ఇవ్వకూడదని, అలా ఇవ్వడం నేరమని మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతామని పేర్కొన్నారు .గంజాయి సేవించడం, అక్రమ రవాణా చేయటం, అక్రమ రవాణా చేసే వారికి సహకరించటం నేరమేనని, జైలు జీవితం గడపాల్సి వస్తుందని, గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులు ఎవరికన్నా ఉంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని పేర్కొన్నారు.. మహిళల భద్రత గూర్చి మాట్లాడుతూ మొబైల్ వాడకం పెరిగిన తర్వాత మహిళలను లొంగదీసుకోవటానికి, అనేక రకాలుగా మోసాలు జరుగుతున్నాయని వారిపట్ల అప్రమత్తమై పోలీసులకు 112, శక్తి యాప్ ద్వారా వెంటనే సమాచారం ఇచ్చి తమను తాము రక్షించుకోవాలని వివరించారు. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు తమ గ్రామాలకు వస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. అలాగే రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని యువత, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో యస్ ఐ సంతోష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడల్లో శాన్విత ప్రతిభ
## ఒకే ఛాంపియన్‌షిప్‌లో ఐదు పతకాలు కైవసం

యాడికి, జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) :



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం నిర్వహించిన అనంతపురం ఛాంపియన్‌షిప్ పోటీల్లో బోయరెడ్డి పల్లె గ్రామంలోని పెన్నా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన విద్యార్థిని



వంక శాన్విత అద్భుత ప్రతిభ కనబరిచింది. బోయరెడ్డిపల్లి పెన్నా కాలేజీలో లెక్చరర్ గా పనిచేస్తున్న వంక నాగేంద్ర కుమార్తె అండర్-14 విభాగంలో పాల్గొన్న 8వ తరగతి విద్యార్థిని వంక శాన్విత, వివిధ క్రీడాంశాల్లో ఏకంగా ఐదు పతకాలను సాధించి సత్తా చాటింది. ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో విశేష ప్రతిభ కనబరిచిన శాన్విత, 100 మీటర్లు మరియు 200 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి విజేతగా (విన్నర్) నిలిచింది. వీటితో పాటు లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించి రన్నరప్‌గా, షాట్‌పుట్‌లో తృతీయ స్థానం సాధించి మెడల్స్ అందుకుంది. అంతేకాకుండా, ఖో-ఖో పోటీలలో కెప్టెన్‌గా వ్యవహరించి తన జట్టును రన్నరప్‌గా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించింది. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ఒకే పోటీలో ఐదు పతకాలు సాధించిన వంక శాన్వితను, ఆమె క్రీడా పటిమను చూసి ఉపాధ్యాయులు, గ్రామస్థులు మరియు తోటి విద్యార్థులు హృదయపూర్వకంగా అభినందించారు...

## అనంతపురం చాంపియన్షిప్ కబడ్డీ పోటీలలో రన్నర్స్ గా నిలిచిన విజన్ హైస్కూల్



యాడికి, జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) :

పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జరిగిన అనంతపురం ఛాంపియన్షిప్ మండల స్థాయి కబడ్డీ పోటీలలో యాడికి మండలంలోని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల జట్ల మధ్య హోరాహోరీగా సాగిన కబడ్డి పోటీలలో ఫైనల్స్ కి యాడికి జెడ్పిహెచ్ఎస్ మరియు విజన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ జట్టు చేరుకోగా ఫైనల్స్ లో యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విజయం సాధించి విన్నర్స్ గా ఎంపిక అవ్వగా రన్నరపుగా విజన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ జట్టు నిలవడం జరిగింది. రన్నర్ గా నిలిచిన విద్యార్థులకు మెడల్స్ ను ప్రధానం చేయడం జరిగింది.. విజన్ విద్యార్థులను విజన్ కరస్పాండెంట్ విశ్వనాథ్ మరియు ఉపాధ్యాయులు అమర్, శేఖర్, కోటి, ప్రసాద్ అభినందించారు...

## స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి




జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) **పల్నాడు జిల్లా, కారంపూడి** :పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమానికి మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన భవనాన్ని భవనంలో లైబ్రరీ మరియు కంప్యూటర్ క్లాస్‌రూమ్‌లను ప్రారంభించారు. అనంతరం స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల విద్యతో పాటు వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని అన్నారు. ప్రతి విద్యార్థికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా వారి ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా కుటుంబంలో ఉన్న ప్రతి విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తున్నామని, గత ప్రభుత్వంలో ఒక కుటుంబానికి ఒకరికి మాత్రమే పరిమితమైన సహాయాన్ని ప్రస్తుతం ప్రతి అర్హ విద్యార్థికి అందిస్తున్నామని తెలిపారు. విద్యను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రపంచంలోని ఉత్తమ విద్యా విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో ఆధునిక విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 16 వేలకుపైగా ఉపాధ్యాయుల నియామకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చారని, అవసరమైన చోట కొత్త తరగతి గదులు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న అపోహలను విడనాడాలని సూచించారు. ఒప్పిచర్ల, మాచర్ల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడం ఇందుకు నిదర్శనమన్నారు. తల్లిదండ్రులు పిల్లలను కేవలం పాఠశాలలో చేర్పించడమే కాకుండా, వారి చదువు, క్రమశిక్షణ, పురోగతిని తరచూ తెలుసుకుంటూ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ ద్వారా పిల్లల చదువుకు సంబంధించిన సమాచారాన్ని తల్లిదండ్రులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ప్రతి వారం పరీక్షలు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ కె. లక్ష్మీ మౌనిక మాట్లాడుతూ, ప్రమాదాల సమయంలో ప్రథమ చికిత్స ప్రాముఖ్యతను వివరించారు. కుక్క కాటు, పాము కాటు, తేలు కాటు, రోడ్డు ప్రమాదాల వంటి అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, కుక్క కరిచిన గాయాన్ని 10 నుంచి 15 నిమిషాల పాటు శుభ్రమైన నీటితో కడగాలని, పాము కరిచిన వెంటనే బాధితుడిని కదిలించకుండా 108కు సమాచారం ఇచ్చి సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు. అధిక రక్తస్రావం జరిగితే గాయంపై ఒత్తిడి పెట్టి రక్తస్రావాన్ని నియంత్రించే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది డాక్టర్ కె. లక్ష్మీ మౌనిక, హెల్త్ అసిస్టెంట్ లాలునాయక్, గ్రా మస్తాన్ వలి తదితరులు, టీడీపీ మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైన్ల డీ-సిల్టింగ్ పనులను నిరంతరం పర్యవేక్షించాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ,** జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) : పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైన్ల డీ-సిల్టింగ్ పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఏలూరు రోడ్, బందర్ రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్, నూజివీడు రోడ్, బీఆర్‌టీఎస్ రోడ్, గులాబీతోట, పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు నిరంతరం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా 33 వెంట్స్ వద్ద ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను డ్రోన్ తో పరిశీలించి, అందులో పేరుకుపోయే గుర్రపు డెక్కలు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. వర్షపు నీటి ప్రవాహానికి ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. శాఖధిపతులు డ్రోన్ వినియోగాన్ని విస్తృతంగా చేపట్టాలని అన్నారు. కేవలం ప్రధాన డ్రైన్లకే పరిమితం కాకుండా నగరంలోని చిన్న, మధ్యతరహా, ప్రధాన డ్రైన్లన్నింటిలోనూ డీ-సిల్టింగ్ పనులు నిరంతరం చేపట్టి, కూడికలు తొలగిస్తూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం గులాబీతోటలోని అన్నా క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. క్యాంటీన్‌కు వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆహార నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణ అత్యున్నత ప్రమాణాలతో ఉండాలని సూచించారు. తాగునీరు, వినియోగ నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, క్యాంటీన్‌లో ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ (ఇన్‌చార్జి) డాక్టర్ గోపాల నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాల కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

# గుడివాడలో కైకాల సత్యనారాయణ 91వ జయంతి వేడుకలు

-నివాళులర్పించిన పద్మశ్రీ మురళీమోహన్, ఎమ్మెల్యే రాము-కాపు సేవా సమితి, కళాకారుల ఆధ్వర్యంలో వేడుకలు.-మురళీమోహన్ కు కాపు సేవా సమితి, కళాకారుల సన్మానం.-తొలి ఏకాదశి రోజు కైకాలకు నివాళి అర్పించడం సంతోషం:మురళీమోహన్ -కైకాలతో కుటుంబ, స్నేహ బంధం ఉంది: మురళీమోహన్-అన్ని పాత్రలకు జీవం పోసిన ఆల్రౌండర్ కైకాల: మురళీమోహన్ -కైకాల లాంటి మహానటుడు గుడివాడలో పుట్టడం గర్వకారణం:ఎమ్మెల్యే రాము



గుడివాడ జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) : తెలుగు సినీ రంగంలో అన్ని పాత్రలకు జీవం పోసిన ఆల్ రౌండర్ లాంటి నటుడు స్వర్గీయ కైకాల సత్యనారాయణ అని మాజీ పార్లమెంట్ సభ్యుడు పద్మశ్రీ మాగంటి మురళీమోహన్ కొనియాడారు. కైకాల పుట్టిన గుడివాడ గడ్డపై ఆయన జయంతి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని మురళీమోహన్ హర్షం వ్యక్తం చేశారు.నవ నట సార్వభౌముడు స్వర్గీయ కైకాల సత్యనారాయణ 91వ జయంతి వేడుకలు గుడివాడ కాపు సేవా సమితి మరియు పట్టణ కళాకారుల శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మాజీ పార్లమెంట్ సభ్యుడు, పద్మశ్రీ మాగంటి మురళీమోహన్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు.ఓల్డ్ మున్సిపల్ కార్యాలయ సెంటర్లో గల కైకాల సత్యనారాయణ విగ్రహానికి మురళీమోహన్, ఎమ్మెల్యే రాము మరియు కూటమి నాయకులు పూలమాలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జోహార్ కైకాల అంటూ మురళీమోహన్ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సేవాసమితి పెద్దలు,కళాకారులు , మరియు గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య మురళీమోహన్ కు గౌరవ సన్మానం చేశారు.అనంతరం మురళీమోహన్ మీడియాతో మాట్లాడుతూ పవిత్రమైన తొలి ఏకాదశి రోజు గుడివాడకు రావడం, తనకు ఎంతో ఆప్తుడైన కైకాల సత్యనారాయణకు నివాళి అర్పించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. కైకాలతో తనకు కుటుంబ బంధాలు, స్నేహ సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. కైకాల తాత, తన తాత కొత్తవరంలో మంచి స్నేహితులని గుర్తుచేశారు. షూటింగ్ లేని సమయంలో కైకాలతో తాను అనేకసార్లు కలుసుకునేవాడినని చెప్పారు.సినీ రంగంలో బాగా రాణిస్తున్నావని అభినందిస్తూ కైకాల తనకు మూడు ముఖ్యమైన సూత్రాలు నేర్పారని వివరించారు. షూటింగ్ సమయంలో వేషాలు లేక వచ్చే సీనియర్ నటులను గౌరవించి, మర్యాద చేయాలని,షూటింగ్ విరామ సమయంలో విహారయాత్రలకు వెళ్లకుండా, ప్రొడ్యూసర్లకు టచ్ లో ఉండి డబ్బింగ్ ఉందా, షూటింగ్ ప్యాచ్ వర్క్ ఉందా అని అడగాలని చెప్పారని తెలిపారు. మూడవ సూత్రం డబ్బు ఇస్తే గానీ షూటింగ్ కు రాను అని ప్రొడ్యూసర్ తో ఎప్పుడూ అనవద్దని కైకాల హితవు పలికారని పేర్కొన్నారు. కొందరు ప్రొడ్యూసర్లు భార్య మెడలో పుస్తెలు అమ్మి మరీ సినిమాలు తీస్తారని, అలాంటి వారిని గౌరవించాలని కైకాల తనకు చెప్పారని గుర్తుచేశారు.ఎన్నో సినిమాల్లో కలిసి నటించిన కైకాల తనకు ఎంతో మంచి మిత్రుడని, ఆయన పుట్టిన గుడివాడలో నేడు ఆయన విగ్రహానికి నివాళులర్పించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. చివరి దశలో అనారోగ్యంతో ఉన్నప్పుడు కైకాలను కలిసినప్పుడు ఆయన పేరుపేరునా ప్రతి ఒక్కరి గురించి అడిగారని నాటి రోజులను గుర్తుచేసుకున్నారు.అన్న ఎన్టీఆర్ అంటే తనకు, కైకాలకు ఎన్నలేని ప్రేమ ఉండేదని పేర్కొన్నారు. అన్ని పాత్రలకు జీవం పోసిన కైకాల ఆల్రౌండర్ లాంటి నటుడని, యముడు పాత్ర పేటెంట్ కైకాలదే అని మురళీమోహన్ కొనియాడారు.

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ

కైకాల సత్యనారాయణ లాంటి మహానటుడు గుడివాడ గడ్డపై పుట్టడం మాకు గర్వకారణమని అన్నారు. ఆయన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే రాము కోరారు.జయంతి వేడుకల్లో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, స్వర్గీయ కైకాల సత్యనారాయణ జయంతి సభలో పాల్గొన్న ముఖ్యులు.శ్రీ ప్రభాకర నాట్యమండలి ప్రధాన కార్యదర్శి మట్టా రాజా, చార్లీ చాప్లిన్ కామెడి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నరహరిశెట్టి ప్రసాద్, కార్యదర్శి వంగా శ్రీనివాస్,(వంశీ), కాపు సేవా సమితి వ్యవస్థాపకులు పొన్నూరు రామకృష్ణ, సేవా సమితి కార్యదర్శి ఆత్మూరి మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షులు సుంకర గాంధీ,సనకా సుబ్బారావు, రమణారావు,టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, పంద్రాజు సాంబయ్య,లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహన్రావు, పైడిముక్కల వంశీ, జనసేన నాయకులు సాయన రాజేష్,పేర్ని జగన్, పలువురు కూటమి నాయకులు , కళాకారులు పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లా నీతివంతులకు, నిజాయతీపరులకు మారుపేరు

- సినీనటుడు, పద్మశ్రీ మురళీమోహన్

-ఐ లవ్ గుడివాడ సింబల్ వద్ద... విక్టరీ చూపిస్తూ హర్షం వ్యక్తం చేసిన మురళీమోహన్ -నీట్ లీకేజీని సరిదిద్దేందుకు ప్రధాని మోడీ సిద్ధం: మురళీమోహన్-గొప్ప వ్యక్తి మురళీమోహన్ కు పద్మశ్రీ రావడం గర్వకారణం: ఎమ్మెల్యే రాము-మురళీమోహన్ మా తరానికి ఆదర్శప్రాయుడు, స్ఫూర్తి దాత: ఎమ్మెల్యే రాము



గుడివాడ జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) : కృష్ణాజిల్లా అంటే నీతిమంతులు, నిజాయితీపరులైన నాయకులకు నిలయంగా ఉండేదని మాజీ పార్లమెంట్ సభ్యుడు పద్మశ్రీ మాగంటి మురళీమోహన్ పేర్కొన్నారు. తెలుగుజాతికి రెండు కళ్ళు లాంటి ఎన్టీఆర్, ఏఎన్నార్ నడయాడిన గుడివాడ గడ్డ రావడం సంతోషకరమని ఆయన హర్షం వ్యక్తం చేశారు.గుడివాడ పర్యటనలో భాగంగా ఏలూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయం ప్రజావేదికకు మాజీ పార్లమెంట్ సభ్యులు, పద్మశ్రీ మాగంటి మురళీమోహన్ శనివారం విచ్చేశారు. ముందుగా ఏజికే స్కూల్ సెంటర్లోని ఐ లవ్ గుడివాడ వద్ద ఎమ్మెల్యే రాముతో కలిసి ఫోటోలు దిగిన మురళీమోహన్ విక్టరీ సింబల్ చూపిస్తూ ఐ లవ్ గుడివాడ అన్నారు. గుడివాడను ప్రేమించే రాము లాంటి మంచి వ్యక్తి ఎమ్మెల్యేగా ఉండడం మంచి విషయం అన్నారు.వైసీపీ ప్రభుత్వంలో ప్రజావేదికను కూల్చివేయడంతో దానికి గుర్తుగా గుడివాడలో ప్రజావేదిక ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మురళీమోహన్ కు వివరించారు. నాటి విధ్వంసం, ఘోరాలను ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నామని మురళీమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం ఎమ్మెల్యే రాము కార్యాలయంలో కూటమి నాయకులతో మురళీమోహన్ కొద్దిసేపు ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా కూటమి శ్రేణులు మురళీమోహన్ తో ఫోటోలు దిగి పలకరించారు. జనసేన యువతతో మాట్లాడుతూ రాష్ట్రంలో పవన్ కళ్యాణ్ కు చంద్రబాబు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో, గుడివాడలో మీకు ఎమ్మెల్యే రాము అంతే ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఇప్పుడు వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ రావడానికి కృషి చేయాలని వారికి సూచించారు.

### ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ

కృష్ణా జిల్లా నీతివంతులు, నిజాయితీపరులు, స్వచ్ఛమైన రాజకీయ నాయకులకు మారుపేరని, సొంత డబ్బు ఖర్చు చేసే పిన్నమనేని కోటేశ్వరరావు లాంటి నాయకులు ఎందరో ఇక్కడ ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గం ఎంతో ముఖ్యమైనదని, గుడివాడలో ఎవరు గెలిస్తే అదే పార్టీ రాష్ట్రంలో గెలుస్తుందనే నానుడి ఉందని తెలిపారు. అలాంటి నియోజకవర్గానికి మంచి అభ్యర్థిని పార్టీ ఎంపిక చేస్తుందని అందరూ ఎదురుచూశామని, ఆ ప్రయత్నంలోనే ఎన్నారై అయిన రాము లాంటి మంచి వ్యక్తికి టికెట్ ఇచ్చిందని అన్నారు. టికెట్ ఇవ్వగానే తాను ఫోన్ చేసి అభినందించానని, ప్రెస్టేజ్ సీటు గెలవాలని శుభాకాంక్షలు చెప్పానని గుర్తుచేశారు. ఎంతో కష్టపడి పనిచేసిన రాము అందరి మన్ననలతో గెలిచారని కొనియాడారు.

### ఎన్టీఆర్, ఏఎన్నార్ నడయాడిన గుడివాడకు రావడం ఆనందంగా ఉందని చెప్పారు.

నీట్ పేపర్ లీకేజీపై స్పందిస్తూ విద్యార్థులకు అన్యాయం జరిగినప్పుడు అందరం ఖండించాల్సిందేనని అన్నారు. కష్టపడి చదివిన విద్యార్థులు పేపర్ లీక్ వల్ల నష్టపోవడం దారుణమని పేర్కొన్నారు. జరిగిన పొరపాట్లను సరిదిద్దుకోవడానికి ప్రధాని మోడీ సిద్ధంగా ఉన్నారని, ఈ విషయాన్ని ఆయన వీడియో సందేశం ద్వారా ఇప్పటికే తెలిపారని వివరించారు. పార్లమెంట్ లో కఠిన చట్టాలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. విద్యార్థుల ఉద్యమాన్ని రాజకీయం చేయడం సరికాదని, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకొని విద్యార్థులు ముందుకు వెళ్లాలని సూచించారు. రాజకీయ ఉచ్చులో పడితే విద్యార్థులే నష్టపోతారని హెచ్చరించారు. రాజకీయాల్లో బిజీగా ఉండటంతో జయభేరి బ్యానర్ పై సినిమాలు చేయడం లేదని, అయితే ఇప్పుడు ట్రెండ్, సినిమాలు తీసే పద్ధతులు మారిపోయాయని తెలిపారు. తనకు పద్మశ్రీ అవార్డు రావడం సంతోషకరమని, భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎందరో రాజకీయ ఉద్దండులకు కృష్ణాజిల్లా నిలయమని ముగించారు.

### ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ

చంద్రబాబు వచ్చిన అయిదు రోజుల తర్వాత ఆంధ్రులు అభిమానించే మురళీమోహన్ గుడివాడ రావడం సంతోషంగా ఉందని అన్నారు. ఆయనకు పద్మశ్రీ రావడం తెలుగువారికి గర్వకారణమని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి సినిమాల్లో చూసిన మహనీయుడు మురళీమోహన్ అని, నటుడిగా మాత్రమే కాకుండా రాజకీయ, వ్యాపార, నిర్మాణ రంగాల్లో సక్సెస్ అయ్యారని కొనియాడారు. మురళీమోహన్ తమ అందరికీ ఆదర్శప్రాయుడు, స్ఫూర్తి దాత అని ఎమ్మెల్యే రాము అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, సీనియర్ టిడిపి నాయకులు లింగం ప్రసాద్, పిన్నమనేని బాబ్జి, చేకూరు జగన్ మోహన్ రావు, పట్టణ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.






## సమస్యలు పరిష్కరిస్తాం. సంక్షేమ పథకాలను అందిస్తాం

ఎమ్మెల్యే గద్దె



**విజయవాడ,** జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజల సమస్యల పరిష్కారంతో పాటుగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.శనివారం ఉదయం తూర్పులోని ఎమ్మెల్యే కార్యాలయం లో ప్రజాదర్బార్ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యను పరిష్కరించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి వారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడం అనేది ప్రభుత్వ బాధ్యత అన్నారు. అందువల్ల ప్రజలు ఈ ప్రజాదర్బార్ కార్యక్రమానికి వచ్చి వారి సమస్యలను తెలియజేయాలని గద్దె కోరారు. అంతేకాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక పోయినా ప్రజలు ఈ ప్రజాదర్బార్‌కు వచ్చి తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అధికారులతో మాట్లాడి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని ఎమ్మెల్యే గద్దె చెప్పారు.ఈ కార్యక్రమంలో ముమ్మనేని ప్రసాద్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ,నందిపాటి దేవానంద్, బాశంశెట్టి రవి, కర్ణ రమేష్, తాతారావు, కొత్తపల్లి దుర్గాప్రసాద్, ఏసీపీ మోహన్‌బాబు, ట్రాఫిక్ సీఐ డీవీ.రమణ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కాపు జాతి హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానేత ముద్రగడ్డ పద్మనాభం కు పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధుల ఘన నివాళులు



**విజయవాడ,** జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) : గుంటూరులో కాపు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముద్రగడ్డ పద్మనాభం సంస్మరణ సభలో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని మహానేత ముద్రగడ్డ పద్మనాభం కు ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ ముద్రగడ్డ పద్మనాభం మరణం కాపు జాతికి తీరని లోటని, కాపు సామాజిక వర్గం హక్కులు, ఆత్మగౌరవం, అభ్యున్నతి కోసం ఆయన చివరి శ్వాస వరకు అహర్నిశలు పోరాడిన మహానేత అని కొనియాడారు, మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేగా అనేక పదవులు నిర్వహించినప్పటికీ, వ్యక్తిగత ప్రయోజనాల కంటే సమాజ హితానికే ప్రాధాన్యత ఇచ్చిన నాయకుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని.కాపు రిజర్వేషన్లు, విద్యా అవకాశాలు, రాజకీయ ప్రాధాన్యత, సామాజిక న్యాయం వంటి అంశాలపై ముద్రగడ్డ పద్మనాభం ఎన్నో ఉద్యమాలు చేసి ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించారని గుర్తు చేశారు. ఆయన చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ఉమా అన్నారు.కాపు సామాజిక వర్గానికి సంబంధించిన న్యాయమైన డిమాండ్లను పార్టీ అధిష్ఠానం, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని బొండా ఉమా స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో, శాంతియుతంగా హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.త్వరలో విజయవాడలో మహానేత ముద్రగడ్డ పద్మనాభం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా ఉమా వెల్లడించారు. ఆ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించాలని కోరారు.చివరగా, "జోహార్ వంగవీటి మోహనరంగా... జోహార్ ముద్రగడ్డ పద్మనాభం గారు..." అంటూ మహానేతలకు నివాళులర్పించారు.

## సీఎంఆర్ఎఫ్ ఎల్.ఓ.సి అందజేత.
# 3.07 లక్షల వైద్యసాయం మంజూరు



**విజయవాడ,** జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆర్థిక ఇబ్బందులతో ఎవరూ వైద్య చికిత్సలకు దూరం కాకుండా ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా అవసరమైన వారికి అండగా నిలుస్తోందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు.జి.కొండూరు మండలం, కట్టుబడిపాలెం (ఆర్) గ్రామానికి చెందిన శ్రీమతి సుద్దపల్లి లక్ష్మి సరోజిని కు 3,07,410ల విలువైన సీఎంఆర్ఎఫ్ ఎల్.ఓ.సిని మంజూరు చేసింది. ఈ ఎల్.ఓ.సిని శనివారం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఖరీదైన వైద్య చికిత్సలు భారంగా మారకుండా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజలకు అవసరమైన సేవలను వేగవంతంగా అందించడమే తమ లక్ష్యమని, నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి అవసరం వచ్చినా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎల్.ఓ.సి మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు ఆలయాలకు పోటెత్తిన భక్తులు



యాడికి, జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) :

హిందువులకు అత్యంత పవిత్రమైన తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని యాడికి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంతో పాటు శ్రీ పాండురంగ స్వామి ఆలయాలలో భక్తుల జనసందోహంతో కిటకిటలాడాయి. ఈ శయని ఏకాదశి నాడే శ్రీమహావిష్ణువు క్షీరాబ్ధిలో యోగనిద్రలోకి వెళ్తాడనే నమ్మకంతో, స్వామివారి కృపాకటాక్షాల కోసం తెల్లవారుజాము నుంచే స్థానిక భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు.తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణాలను సువాసనల పుష్పాలు, తోరణాలు మరియు రంగురంగుల విద్యుత్ దీపాలతో అత్యంత మనోహరంగా అలంకరించారు. ఉదయాన్నే అర్చకస్వాములు సుప్రభాత సేవతో ప్రారంభించి, స్వామివార్లకు పంచామృత అభిషేకాలు, సహస్రనామార్చన మరియు ప్రత్యేక తులసీదళ అలంకరణలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దివ్యరూప దర్శన భాగ్యం కల్పించారు.ఆలయ ప్రాంగణాలు "గోవిందా.. గోవిందా.." నామస్మరణలతో మారుమోగాయి. భక్తులు క్రమశిక్షణతో క్యూలైన్లలో వేచి ఉండి, స్వామివార్లను దర్శించుకుని తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.రోజంతా ఉపవాస జాగరణలు ఉండే భక్తులు ఆలయాల్లో భజనలు, నామసంకీర్తనల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాండురంగ స్వామి ఆలయంలో కూడా ఏకాదశి ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా జరిగాయి.దర్శనం అనంతరం భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అసౌకర్యం, తోపులాటలు జరగకుండా ఆలయ కమిటీ సభ్యులు, సేవా సంస్థల ప్రతినిధులు మరియు పోలీసులు ప్రత్యేక రక్షణ చర్యలు, మంచినీటి సదుపాయాలు ఏర్పాటు చేశారు..

# టీ టైమ్ విత్ స్టూడెంట్స్ యువత స్వరమే మన బలం..



**అనంత పురం బ్యూరో** జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్) : అనంత పురం ఎస్కేయూ , రాప్తాడు నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు, యువతతో కలిసి మాజీ ఎమ్మెల్యే, రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి "టీ టైమ్ విత్ స్టూడెంట్స్" కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు, యువతతో ప్రకాష్ రెడ్డి ఆత్మీయంగా ముఖాముఖి సమావేశమై, రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యా సమస్యలు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఉపాధి అవకాశాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉన్నత విద్య, పోటీ పరీక్షలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.విద్యార్థులు తమ అభిప్రాయాలు, సమస్యలు, ప్రభుత్వంపై ఉన్న ఆశలు, సూచనలను నేరుగా ప్రకాష్ రెడ్డి తో పంచుకోగా, ప్రతి సమస్యను ఓపికగా విన్న ఆయన, వాటి పరిష్కారం కోసం పార్టీ తరఫున నిరంతరం పోరాడుతామని భరోసా ఇచ్చారు. విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకోవడం, వారి భవిష్యత్తుకు అవసరమైన చర్యలపై సూచనలు స్వీకరించడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యంగా సాగింది.అనంతరం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. డీఎస్సీ నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలు, నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, నిరుద్యోగ భృతి అమలు, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల వంటి సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తు, నిరుద్యోగ యువత హక్కుల కోసం మన గొంతును గట్టిగా వినిపిద్దామని, ఈ ప్రజాస్వామ్య పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు.

## గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రగడ కోటయ్య జయంతి వేడుకలు



- చేనేత కార్మికుల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయం: అధికారులు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** చేనేత కార్మికుల సంక్షేమం, బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతి వేడుకలను ఆదివారం గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాసులు పాల్గొని ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేనేత కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ప్రగడ కోటయ్య చేసిన సేవలు ఆదర్శప్రాయమన్నారు. ఎమ్మెల్యేగా, పార్లమెంట్ సభ్యుడిగా చేనేత రంగానికి పన్ను మినహాయింపులు, సబ్సిడీలు, ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు సాధించడంలో ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. చేనేత వృత్తి పరిరక్షణతో పాటు వెనుకబడిన, బలహీన వర్గాల ఆర్థిక అభ్యున్నతికి కూడా ఆయన విశేషంగా సేవలందించారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసినందుకే ఆయనకు "ప్రజాబంధు" అనే గౌరవం లభించిందని, ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ (అడ్మిన్) కృష్ణయ్య, ఏఆర్ ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, జిల్లా ఎస్పీ ప్రజాసంబంధాల అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నేరాలకు దూరంగా ఉండాలని పోలీసుల కౌన్సిలింగ్




- రౌడీ షీటర్లకు గట్టి హెచ్చరిక..
- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించిన గుంటూరు పోలీసులు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గుంటూరు జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు ఆదివారం ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.
ఈ సందర్భంగా పోలీసు అధికారులు రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు చట్టాలను గౌరవిస్తూ సత్ప్రవర్తనతో జీవించాలని, నేరప్రవృత్తిని పూర్తిగా విడనాడాలని సూచించారు. ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా సమాజంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు.
శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. రౌడీ షీటర్లు, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై జిల్లా వ్యాప్తంగా పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారని, ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వారిపై ఎలాంటి రాజీ లేకుండా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.
జిల్లాలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయడానికి ప్రజల సహకారంతో గుంటూరు జిల్లా పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## బీసీ చైతన్య సమితి మండల అధ్యక్షుడిగా మల్లె బాలకృష్ణ ఏకగ్రీవ ఎన్నిక



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** మండల కేంద్రంలోని స్థానిక పత్రా నాయుళ్ల అన్నదాన సత్రంలో ఆదివారం జాతీయ బీసీ చైతన్య సమితి మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాతీయ బీసీ చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ రమణ జిల్లా అధ్యక్షుడు రాజా ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మంగారిమఠం మండల నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా ఎద్దులాయపల్లె గ్రామానికి చెందిన మల్లె బాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు మల్లె బాలకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిర్వహిస్తానని తెలిపారు. మండలంలోని ప్రతి బీసీ సోదరుడికి అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.
ఈ సమావేశంలో జాతీయ, జిల్లా, మండల స్థాయి నాయకులు బీసీ చైతన్య సమితి సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా మాస కల్యాణ మహోత్సవం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మాస కల్యాణ మహోత్సవం ఆదివారం మఠ ప్రాంగణంలో అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి దివ్య ఆశీస్సులతో, వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం నుంచే వేద పండితులు దేవస్థానం పూజారులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం మంత్రోచ్చారణలు మంగళవాయిద్యాల నడుమ స్వామివారి మాస కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సాగిన ఈ పూజా కార్యక్రమాల్లో మఠాధిపతుల వారి సోదరులు శ్రీ దత్తాత్రేయ స్వామి వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ మహోత్సవంలో మాస కల్యాణ ఉభయదాతలు మఠం సిబ్బంది పుర ప్రజలు మరియు భక్తులు విశేషంగా పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులందరికీ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తూర్పు నియోజకవర్గ కార్యకర్తల సంక్షేమ నిధికి రూ.15 లక్షలు

- పార్టీ కార్యకర్తల సంక్షేమమే నా లక్ష్యం
- పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా వెన్నంటే నిలుస్తాను
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- 27 నుంచి ప్రారంభం రెండేళ్ల పాలన- ఇంటింటి ప్రచారాన్ని విజయవంతం చేద్దామని పిలుపు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ తోడునీడగా నిలిచే గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ మరోసారి ముందడుగు వేశారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి తన సొంత నిధులతో 15 లక్షల పండ్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఆదివారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో పార్టీ నేతలతో ఎమ్మెల్యే మెసేజ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం అనునిత్యం అండగా నిలుస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు సామాజికంగానూ, ఆర్థికంగానూ, వ్యక్తిగతంగానూ వారి ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉంటానన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రెండేళ్ల పాలన.. ఇంటింటికి ప్రచారం కార్యక్రమంలో పార్టీ క్యాడర్ ప్రతి ఒక్కరూ భాగస్వాములమై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గడపకూ వెళ్లి పార్టీ అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలన్నారు. తెలుగుదేశం పార్టీలో ప్రజల జీవనోభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలు, రాష్ట్ర ప్రగతికి తీసుకున్న నిర్ణయాలు, ప్రతి ఇంటికీ చేరుతున్న సంక్షేమ ఫలాలు గురించి తెలియజేస్తూనే ప్రజల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గడపలోనూ జరిగిన మంచి గురించి అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత తెలుగుదేశం పార్టీ కేడర్ దేనని స్పష్టం చేశారు.

## బహిరంగ మద్యం సేవించడంపై పోలీసుల ప్రత్యేక తనిఖీలు

- 17 ఎఫ్ఐఆర్‌లు, 147 పెట్టీ కేసులు నమోదు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై గుంటూరు జిల్లా పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 17 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతో పాటు 147 పెట్టీ కేసులు నమోదు చేశారు. మహిళలు, చిన్నారులు, సాధారణ ప్రజలు భయాందోళనలు లేకుండా సంచరించే వాతావరణం కల్పించడం, శాంతిభద్రతలు పరిరక్షించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రధాన కూడళ్లు, వైన్ షాపుల పరిసరాలు, ఖాళీ స్థలాలు, పార్కులు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్ పరిసరాలు, నిర్మానుష్య రహదారుల్లో తనిఖీలు నిర్వహించి బహిరంగంగా మద్యం సేవిస్తున్న పలువురిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు.
అదుపులోకి తీసుకున్న వారికి బహిరంగంగా మద్యం సేవించడం చట్టవిరుద్ధమని, దీనివల్ల శాంతిభద్రతలకు భంగం కలుగుతుందని పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మహిళలు, చిన్నారులు నిర్భయంగా సంచరించే వాతావరణం కల్పించడమే పోలీసుల ప్రాధాన్యత అని చెప్పారు. వైన్ షాపుల యజమానులు తమ దుకాణాల వద్ద లేదా పరిసరాల్లో బహిరంగంగా మద్యం సేవించేందుకు అనుమతిస్తే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.
బహిరంగ మద్యం సేవ, గొడవలు లేదా మహిళలకు ఇబ్బందులు కలిగించే ఘటనలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా 100, 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రజా చైతన్యంతోనే తెలుగు భాష పరిరక్షణ సాధ్యం

- తెలుగు మరియు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్




**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజల్లో చైతన్యం పెరిగినప్పుడే తెలుగు భాష పరిరక్షణ సాధ్యమవుతుందని తెలుగు మరియు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ అన్నారు. తెలుగు దండు ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.
ప్రపంచంలోని 80 శాతం కంటే ఎక్కువ దేశాల్లో మాతృభాషలోనే విద్యాబోధన జరుగుతుండగా, సుమారు 12 కోట్లకు పైగా తెలుగు ప్రజలు మాత్రం ఆంగ్ల భాష వ్యామోహంతో తమ మాతృభాషను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనధికారిక అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 18 కోట్ల మంది తెలుగు ప్రజలు ఉన్నారని, ఇంత పెద్ద భాషా సమాజం తమ భాషను పరిరక్షించుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రాథమిక విద్య మాతృభాషలోనే సాగాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసిందని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేసేలా తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజల్లో డిమాండ్ పెరిగేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.
రాష్ట్రంలో 90 శాతం మంది ప్రజలు మాతృభాషలోనే సేవలు పొందుతున్నారని, విదేశాలకు వెళ్లే వారి సంఖ్య ఐదు శాతానికి కూడా చేరదని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో అందరినీ ఆంగ్ల భాష వైపు మళ్లించడం సమంజసం కాదన్నారు. కార్పొరేట్ విద్యా వ్యవస్థ ప్రభావంతో తెలుగు భాషకు నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత మాజీ రాష్ట్రపతులు అబ్దుల్ కలాం, జాకీర్ హుస్సేన్, సర్వేపల్లి రాధాకృష్ణన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వంటి ప్రముఖులు మాతృభాషలోనే విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని గుర్తు చేశారు. న్యాయవ్యవస్థ, పోలీసు శాఖల్లో కూడా మాతృభాష వినియోగాన్ని మరింత విస్తరించాలని అధికార భాషా సంఘం చైర్మన్ విక్రమ్ పోలాను కోరారు.
తెలుగు అకాడమీ ద్వారా భాషా ప్రచారం, వ్యాప్తికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని, తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా సాహిత్యం, కళలు, ఇతర రంగాల్లో సేవలందించిన వారికి పురస్కారాలు అందజేస్తామని వెల్లడించారు.
అధికార భాషా సంఘం చైర్మన్ విక్రమ్ పోలా మాట్లాడుతూ, ప్రాథమిక విద్య మాతృభాషలోనే జరిగేలా కృషి చేస్తానని, ప్రభుత్వ వ్యవహారాల్లో తెలుగు భాషను మరింత పటిష్టంగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
తెలుగు దండు అధ్యక్షుడు పరవస్తు సూరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాతృభాష పరిరక్షణ సంస్థ నాయకుడు చలసాని శ్రీనివాస్, ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, సాహితీవేత్త దివి కుమార్, డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్, తిరుపతి రాజమన్నార్, లగడపాటి సంగయ్య, సాహితీవేత్తలు నందిని, రజని, ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

## చేనేతల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య

- మంత్రి నారా లోకేష్ చొరవతో ప్రగడ కోటయ్య జయంతి అధికారిక నిర్వహణ చేనేతలకు గౌరవప్రదం - గుత్తికొండ ధనుంజయరావు



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లో ప్రజాబంధు, చేనేతోద్యమ సూర్యుడు ప్రగడ కోటయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ దేశంలోని చేనేత జాతి గర్వించదగ్గ మహనీయుడు ప్రగడ కోటయ్య అని కొనియాడారు. చేనేత కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన ప్రజానాయకుడు, ప్రజాబంధు ప్రగడ కోటయ్య సేవలు చిరస్మరణీయమని అన్నారు.
నేత వర్గాల ప్రయోజనాల కోసం సత్యాగ్రహాలు నిర్వహించి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన మహోన్నత నాయకుడు ప్రగడ కోటయ్య అని పేర్కొన్నారు. ప్రాథమిక చేనేత సహకార సంఘాల ఏర్పాటు, అసంఘటితంగా ఉన్న చేనేత రంగ అభివృద్ధి, చేనేత కార్మికులు నేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధర కల్పించడం, వారి జీవనోపాధిని మెరుగుపరచడం కోసం ఆయన చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.
ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం చేనేత వర్గాలకు ఇచ్చిన గౌరవమని తెలిపారు. మంత్రి నారా లోకేష్ చొరవతోనే ఈ నిర్ణయం అమలులోకి రావడం అభినందనీయమని, ఇది చేనేతల పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. మంగళగిరి టిడ్కో గృహ సముదాయంలో రూ.10 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మెగా పార్కుకు ప్రగడ కోటయ్య పేరు పెట్టడంతో పాటు అక్కడే ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేష్ నిర్ణయించడం చేనేత సమాజంపై ఆయనకు ఉన్న ప్రత్యేక అభిమానాన్ని, నిబద్ధతను తెలియజేస్తోందన్నారు. అధికారం గా జయంతి కార్యక్రమం నిర్ణయం దశాబ్దాల రాజకీయ చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా చేనేత మహనీయుడికి నిజమైన గౌరవాన్ని తెలుగుదేశం ప్రభుత్వం అందించిన చారిత్రాత్మక ఘట్టమని గుత్తికొండ ధనుంజయరావు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు దామర్ల రాజు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విన్నకోట శ్రీనివాసరావు, రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ఆకురాతి నాగేంద్రం, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు, కాటబత్తిన నిర్మల, కారంపూడి అంకమ్మరావు, గోవాడ దుర్గారావు, జొన్నాదుల బాలకృష్ణ, బుదాటి శ్రీనివాసరావు, వడిశా నరేష్, పొట్లబత్తుల లక్ష్మణరావు, కోసూరి రాజశేఖర్, ఉద్దంటి గాంధీ, గంజి చంద్రశేఖర్, సైనాదం శ్రీనివాసరావు, కారంపూడి చిరంజీవి, తేలు వెంకటేశ్వర్లు, రంగిశెట్టి పెద్దబ్బాయ్, బట్టు మోహన్, వంగర పెద లక్ష్మయ్య, అనుముల శ్రీనివాసరావు, జొన్నాదుల మల్లేశ్వరరావు, జంజనం వెంకటేశ్వర్లు, ఆకురాతి రాము, ఆకురాతి లక్ష్మణ్, పంది రామకృష్ణ, బలభద్ర రమేష్, తోకల బాలాజీ, కౌతరపు శ్రీనివాసరావు, పాలాది దాసు, నాగులపల్లి వెంకన్న, ఇమ్మండి రామారావు, కొల్లి శ్రీనివాసరావు, పలువురు చేనేతలు పాల్గొన్నారు.

## ఫిజియోథెరపీపై అవగాహన పెరగాలి: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు అమరావతి రోడ్ మల్లికార్జునపేట 5వ లైన్‌లోని రిలీఫ్ ఫిజియోథెరపీ క్లినిక్ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ నేటి కాలంలో ఫిజియోథెరపీ, ఆర్థోపెడిక్ వైద్య సేవల అవసరం మరింత పెరిగిందని అన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వైద్య సేవలను అందించేందుకు రిలీఫ్ ఫిజియోథెరపీ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. కీళ్ల నొప్పులు, వెన్నునొప్పులు తదితర సమస్యలతో బాధపడుతున్న వారు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న గ్రేస్, వారి బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

## పత్తి బీమా ప్రీమియం చెల్లింపునకు జూలై 31 వరకు గడువు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** పత్తి పంట బీమా ప్రీమియం చెల్లింపునకు జూలై 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా పత్తి రైతులు తప్పనిసరిగా పంట బీమా చేయించుకోవాలని సూచించారు. పండు మిరప, మినుము పంటలకు కూడా జూలై 31లోగా, వరి పంటకు ఆగస్టు 15లోగా ప్రీమియం చెల్లించాలని పేర్కొన్నారు.
వరి పంటకు మొత్తం ప్రీమియం రూ. 2,000 కాగా రైతు వాటా రూ. 800, పండు మిరపకు మొత్తం ప్రీమియం రూ. 6,750లో రైతు వాటా రూ. 2,700, మినుముకు మొత్తం ప్రీమియం రూ. 500లో రైతు వాటా రూ. 200, పత్తి పంటకు మొత్తం ప్రీమియం రూ. 4,750లో రైతు వాటా రూ. 1,900గా నిర్ణయించినట్లు తెలిపారు. అర్హులైన రైతులు నోటిఫై చేసిన పంటలకు నిర్ణీత గడువులోగా పంటల బీమాలో నమోదు చేసుకోవాలని కోరారు.
ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలుకు జెనరలి సెంట్రల్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని, పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం అమలుకు ఐఎఫ్ఎఫ్‌సీఓ--టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని ప్రభుత్వం నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, వర్షాభావం, అధిక వర్షాలు తదితర కారణాలతో సంభవించే పంట నష్టాలకు ఆర్థిక రక్షణ కల్పించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశమని వివరించారు.
రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాలు, రైతు సేవా కేంద్రాలు, బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, కామన్ సర్వీస్ సెంటర్లు లేదా సంబంధిత బీమా సంస్థ ప్రతినిధులను సంప్రదించి పంటల బీమాలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ఇంటింటికీ కూటమి ప్రభుత్వ విజయాలను తీసుకెళ్లాలి

- రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలి
- ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమాన్ని చేరవేద్దాం
- మంగళగిరి అభివృద్ధిని ఇంటింటికీ తీసుకెళ్దాం:
- ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి: నందం అబద్దయ్య



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రవ్యాప్తంగా జూలై 27 నుంచి చేపట్టనున్న 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించడం ద్వారా ప్రభుత్వ పనితీరును ప్రజలకు చేరవేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో తీసుకొచ్చిన మార్పులను వివరించి వారి ఆశీర్వాదం పొందాలని అన్నారు. ముఖ్యంగా మంగళగిరి నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి జరిగిందని నందం అబద్దయ్య పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల సమర్థ అమలుతో మంగళగిరి రాష్ట్రానికే ఆదర్శ నియోజకవర్గంగా నిలిచిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన విజయాలను ప్రజలకు చేరవేయడం ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త బాధ్యత అని ఆయన అన్నారు. జూలై 27 నుంచి ప్రారంభమయ్యే ఇంటింటి ప్రచార కార్యక్రమంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రతి కుటుంబాన్ని కలుసుకుని ప్రభుత్వ విజయాలను వివరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నందం అబద్దయ్య పిలుపునిచ్చారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## బీమా బకాయిల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



- వైసీపి బకాయి పెట్టిన 1,900 కోట్ల బీమా ప్రీమియాన్ని విడతలవారీగా చెల్లిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ హామీతో కేంద్రం గ్రీన్ సిగ్నల్
- ఖరీఫ్-2024 పంటల బీమా నిధులు నేరుగా రైతుల ఖాతాల్లోకి: మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వైసీపీ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 1,900 కోట్ల పంటల బీమా ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడతలవారీగా చెల్లిస్తామని కేంద్ర ప్రభుత్వానికి హామీ ఇవ్వడంతో ఖరీఫ్-2024 పంటల బీమా బకాయిలను విడుదల చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఇటీవల కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి రాష్ట్ర రైతుల సమస్యలను వివరించి, పెండింగ్ బీమా నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించిన నేపథ్యంలో కేంద్రం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. కేంద్రం నుంచి ఖరీఫ్-2024 పంటల బీమా నిధులు విడుదలైన వెంటనే అర్హత కలిగిన రైతుల ఖాతాల్లో నేరుగా జమ కానున్నాయని మంత్రి తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన సమస్యలకు కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కారం చూపుతూ, రైతులకు అందాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందేలా చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల సమస్యలపై సానుకూలంగా స్పందించి బీమా నిధుల విడుదలకు సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు క్షేత్రస్థాయిలో సిద్ధం కావాలి



- తాడికొండ బీజేపీ సంస్థాగత సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి మధుకర్ జీ పిలుపు

**తాడికొండ,(జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గ సంస్థాగత సమావేశం ఆదివారం నిర్వహించారు. పార్టీ సంస్థాగత బలోపేతం, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఎస్ఆర్) కార్యక్రమం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.
సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి మధుకర్ జీ మాట్లాడుతూ బీఎల్ఏ-2లు అందరూ బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుని ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. రాష్ట్ర, జిల్లా పార్టీలు చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి పోలింగ్ బూత్‌లో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలని, కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన కార్యాచరణతో పాటు పార్టీ నిర్వహించనున్న వివిధ కార్యక్రమాలపై కూడా సమావేశంలో చర్చించారు.
సమావేశంలో గుంటూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్, తాడికొండ బీఎల్ఏ-1 ఆమతి వెంకటరమణ, స్పైస్ బోర్డు సభ్యుడు కొత్తూరు వెంకట సుబ్బారావు, కంతేటి బ్రహ్మయ్య, కొక్కిరి శ్రీనివాస్, బజరంగ్ రామకృష్ణ, తాడికొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధ్యక్షులు బండ్ల అశోక్, ఎస్.కే. భాష, నీరుకొండ లక్ష్మణ్ నారాయణ, మేరీగ లక్ష్మారెడ్డి, బీఎల్ఏ-2లు, పోలింగ్ బూత్ ఏజెంట్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిల్లలను చదివించే తల్లులకు ప్రోత్సాహకంగా తల్లికి వందనం పథకం



- తల్లికి వందనం పథకం అమలుకు ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ కేటాయించాలి

**ఘంటసాల (జర్నలిస్ట్ ఫైల్):** చదువు విలువ తెలుసుకొని పిల్లలను చదివించే తల్లులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతోనే ప్రభుత్వం తల్లికి వందనం కార్యక్రమం పథకం అమలు చేస్తుందని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు తెలిపారు. తల్లికి వందనం లబ్ధిదారులతో ఘంటసాల లో గౌతమ్ ట్యుటోరియల్స్ నందు ఆదివారం సురేష్ బాబు ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. తల్లులకు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ తల్లికి వందనం పథకం పట్ల ప్రభుత్వ ఆశయాలను వివరించారు. ఈసందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ పిల్లల చదువుల పట్ల కుటుంబంలో తల్లుల యొక్క పాత్ర ప్రత్యేకమైనదని అన్నారు. చదువుల పట్ల తల్లులు తీసుకునే శ్రద్ధ పైనే కుటుంబం యొక్క విద్యాభివృద్ధి ఆధారపడి ఉంటుందని అన్నారు. విద్యా శాఖలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక పథకం తల్లికి వందనం ద్వారా చెల్లించే నగదును సద్వినియోగం చేసుకొని పిల్లలను మరింత శ్రద్ధగా చదివించాలన్నారు. తల్లికి వందనం కార్యక్రమంలో నెలకొంటున్న సాంకేతిక సమస్యలను తొలగించి ప్రతి ఒక్కరికి పథకం యొక్క ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తల్లికి వందనం నగదు జమ కాని వారికోసం పిర్యాధుల స్వీకరణకు ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరు అయ్యేలా చూసి వారి విద్యాభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సురేష్ బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో నేతలు మెరుగు వేణుగోపాలరావు, డి.కోటయ్య,యుటోరియల్ నిర్వాహకురాలు మెరుగు ప్రశాంతి పాల్గొన్నారు.

# చిరంజీవి సమయస్ఫూర్తి.. సతీశ్‌రెడ్డి సేవాస్ఫూర్తి !

- కళా, రక్షణ రంగాలకు వారి కృషితో తెలుగు వారికి ఘన కీర్తి
- చిరంజీవి సినిమాలకు నక్షత్రాలు కట్టా
- హైదరాబాదులో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్




**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్) :** కళారంగంలో మెగాస్టార్ చిరంజీవి, రక్షణ రంగంలో శాస్త్రవేత్త జి.సతీశ్‌రెడ్డి తెలుగు ప్రజలు గర్వించదగ్గ ప్రముఖులని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కొనియాడారు. చిరంజీవి తన నటనతో కోట్లాది మంది హృదయాలను గెలుచుకోగా, సతీశ్‌రెడ్డి దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేసిన మేటి శాస్త్రవేత్తగా నిలిచారని పేర్కొన్నారు. హైదరాబాద్ లో ఆదివారం బీవీ పట్టాభిరామ్ పేరుతో ఏర్పాటు చేసిన తొలి పురస్కారాన్ని సతీశ్‌రెడ్డికి ప్రదానం చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవిపై తనకున్న అభిమానాన్ని, సతీశ్‌రెడ్డితో ఉన్న 35 ఏళ్ల అనుబంధాన్ని సత్యకుమార్ గుర్తుచేసుకున్నారు.
**చిరంజీవి సినిమాలకు నక్షత్రాలు కట్టా... :** తాను 15 ఏళ్ల వయసులో బళ్లారిలో పీయూసీ చదువుతున్న సమయంలో చిరంజీవి సినిమా విడుదలైతే థియేటర్ వద్ద పెద్ద నక్షత్రాలను కట్టేవారమని మంత్రి తెలిపారు. 'కిరాతకుడు' సినిమా విడుదలైనప్పుడు రాత్రంతా థియేటర్ వద్ద ఉండి నక్షత్రం కట్టామని, ఆ తర్వాత 'దొంగ మొగుడు' చిత్రానికీ అదే విధంగా చేసినట్లు గుర్తుచేశారు.
"ఆ సినిమా పేర్లలో కాస్త ప్రతికూలత కనిపించవచ్చు. కానీ చిరంజీవిగారిలో మాత్రం అలాంటి ప్రతికూలత ఏ కోశానా లేదు. ఆయన మంచి మనసున్న మెగాస్టార్" అని సత్యకుమార్ వ్యాఖ్యానించారు. సాధారణంగా వయసు పెరుగుతున్న కొద్దీ వృద్ధాప్యం వస్తుందని అంటారని, చిరంజీవి, సతీశ్‌రెడ్డిని చూస్తే మాత్రం రోజురోజుకూ మరింత యువకులుగా, ఉత్సాహంగా కనిపిస్తున్నారని మంత్రి చమత్కరించారు.
**కలాం మాటను నిజం చేసిన సతీశ్‌రెడ్డి :** సతీశ్‌రెడ్డితో తనకు విద్యార్థి దశ నుంచి పరిచయం ఉందని సత్యకుమార్ తెలిపారు. సతీశ్‌రెడ్డి ప్రతిభను మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పాతికేళ్ల క్రితమే గుర్తించారని చెప్పారు. "సతీశ్‌రెడ్డి ఎంతో ప్రతిభావంతుడు. ఒకరోజు దేశానికి శాస్త్రీయ సలహాదారుగా, డీఆర్‌డీవో అధిపతిగా ఎదుగుతారు" అని కలాం అప్పట్లో చెప్పిన మాటలను గుర్తుచేశారు.
ఆ తర్వాత వెంకయ్యనాయుడు కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో అదనపు వ్యక్తిగత కార్యదర్శిగా రావాలని సతీశ్‌రెడ్డిని కోరారని మంత్రి తెలిపారు. ఆ విషయంపై తన సలహా అడిగినప్పుడు రాజకీయ పదవులవైపు కాకుండా శాస్త్రరంగంలోనే కొనసాగాలని చెప్పినట్లు వివరించారు. "అబ్దుల్ కలాం వంటి గొప్ప శాస్త్రవేత్త ఆయన భవిష్యత్తును అప్పుడే గుర్తించారు.
**ఆయన జ్ఞానంతో నాకు చప్పట్లు... :** ఒక కార్యక్రమంలో రక్షణ రంగంపై మాట్లాడాల్సి వచ్చినప్పుడు సభకు కొద్దిసేపటి ముందు ఆయనకు ఫోన్ చేసినట్లు చెప్పారు. ఆ సమయంలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ 15 నిమిషాల్లోనే రక్షణ రంగంలో వచ్చిన మార్పులు, దేశీయ తయారీ, ఎగుమతులు, యుద్ధ విమానాల తయారీపై పూర్తి సమాచారం పంపించారని తెలిపారు. ఆ వివరాలను గుర్తుపెట్టుకొని నేను సభలో మాట్లాడాను. ప్రసంగం పూర్తయ్యాక రక్షణ రంగంపై నాకు ఎంతో పరిజ్ఞానం ఉందని అందరూ అభినందించారు. నిజానికి ఆ జ్ఞానం నాది కాదన్నారు.
ఒకప్పుడు చిన్న రక్షణ పరికరాలను కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న భారత్.. ఇప్పుడు యుద్ధ విమానాలు, క్షిపణులు, ఆధునిక రక్షణ సామగ్రిని స్వదేశంలో తయారు చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరిందన్నారు. ఈ మార్పులో సతీశ్‌రెడ్డి పాత్ర కీలకమని చెప్పారు.
**కరోనా వేళ దేశానికి అండగా... :** కరోనా మహమ్మారి సమయంలో సతీశ్‌రెడ్డి నాయకత్వంలోని డీఆర్‌డీవో దేశానికి అండగా నిలిచిందని మంత్రి తెలిపారు. దేశంలో పీపీఈ కిట్లు, ఎన్-95 మాస్కులు, వెంటిలేటర్లు అందుబాటులో లేని సమయంలో వాటిని స్వదేశంలోనే తయారు చేశారని గుర్తుచేశారు.
సతీశ్‌రెడ్డి శాస్త్రవేత్తగానే కాకుండా సామాజిక స్పృహ కలిగిన వ్యక్తని మంత్రి ప్రశంసించారు.
**ఆంధ్రప్రదేశ్ కోసం కృషి... :** పదవీ విరమణ అనంతరం కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాస్త్రీయ సలహాదారుగా రాష్ట్రానికి రక్షణ, వైమానిక రంగ పరిశ్రమలను తీసుకురావడానికి సతీశ్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. పెట్టుబడులు తీసుకురావడంతోపాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఆయన సేవలు అభినందనీయమన్నారు.
**శ్రోతగా పిలిచి వక్తను చేశారు :** బీవీ పట్టాభిరామ్ పేరుతో ఏర్పాటు చేసిన తొలి పురస్కారాన్ని సతీశ్‌రెడ్డికి, చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్న సభలో అందించడం ఎంతో ప్రత్యేకమన్నారు. కార్యక్రమానికి శ్రోతగా వచ్చిన తనను వేదికపైకి ఆహ్వానించి వక్త గా మాట్లాడే అవకాశం కల్పించిన ఎమెస్కో విజయకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

- సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు



**వైజాగ్ (భోగాపురం), జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్):** భోగాపురంలో నిర్మితమైన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లపై ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు పాల్గొన్నారు. విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన ఆయన భోగాపురం విమానాశ్రయం అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధికారులతో, పార్టీ నాయకులతో ఏర్పాట్లను సమీక్షించారు.
ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా జరగనున్న విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయడానికి గజపతినగరం నియోజకవర్గంలో చేపట్టాల్సిన చర్యలు, జనసమీకరణ, ప్రజాప్రతినిధులు--పార్టీ నాయకుల సమన్వయం వంటి అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.
ఈ సందర్భంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని నక్కా ఆనంద బాబు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు పేరును విమానాశ్రయానికి నామకరణం చేయడం ద్వారా స్వాతంత్ర్య సమరయోధుడి త్యాగానికి శాశ్వత గుర్తింపు లభించిందన్నారు.
ప్రారంభోత్సవ సభ కోసం ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల నుంచి భారీ స్థాయిలో జనసమీకరణ చేపడుతున్నట్లు వెల్లడించారు. పరిశీలకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడం వల్ల ఉత్తరాంధ్రలో పారిశ్రామిక, పర్యాటక, వాణిజ్య రంగాలకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని సమావేశంలో పేర్కొన్నారు. మామిడి, మత్స్య ఉత్పత్తుల ఎగుమతులకు కార్గో సదుపాయం, బీచ్ కారిడార్ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్ ఈ ప్రాంత అభివృద్ధికి ఊతమిస్తాయని వివరించారు. విమానాశ్రయం నుంచి పూర్తి స్థాయి వాణిజ్య విమాన సేవలు ఆగస్టు మధ్య నుంచి ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు.

## గుంటూరులో ఆగస్టు 7 నుంచి 9 వరకు బి2 బిజినెస్ ఎక్స్‌పో



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలోని బండ్లమూడి గార్డెన్స్‌లో ఆగస్టు 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న బి2 బిజినెస్ ఎక్స్‌పో--2026 పోస్టర్‌ను ప్రముఖ రాజకీయవేత్త జూపూడి రంగరాజు ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో కుటీర పరిశ్రమలు కీలక పాత్ర పోషించగా, ప్రస్తుతం యువత ఆధునిక సాంకేతికతతో కొత్త వ్యాపార అవకాశాలను సృష్టిస్తూ పారిశ్రామిక రంగంలో ముందుకు సాగుతోందన్నారు.
మహిళా పారిశ్రామికవేత్తలు కూడా ఎక్స్‌పోలో పాల్గొని తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించాలని సూచించారు. ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాల కింద అర్హులైన పారిశ్రామికవేత్తలకు తక్కువ హామీలతో రూ. 20 లక్షల వం-కు రుణాలు అందిస్తున్న నేపథ్యంలో వాటిని సద్వినియోగం చేసుకుని కొత్త వ్యాపారాలు ప్రారంభించాలని పిలుపునిచ్చారు.
ఎక్స్‌పో అధ్యక్షుడు కుమ్మమూరి శ్రీధర్ బాబు, కార్యదర్శి బి. హేమంత్, కోశాధికారి కె. బాలకృష్ణ, ధృతి హాస్పిటల్స్ సీఈవో డాక్టర్ రేవూరి హరికృష్ణ మాట్లాడుతూ, యువతలో వ్యాపార, పారిశ్రామిక స్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పారిశ్రామిక ప్రోత్సాహక పథకాలను వినియోగించుకుని యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు.
గుంటూరు-విజయవాడ ప్రాంతం వాణిజ్య, వ్యాపార రంగాలకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నందున కొత్త పరిశ్రమలు, స్టార్టప్‌ల ఏర్పాటుకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. ఎక్స్‌పోలో సుమారు 150 ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లు, సేవా సంస్థలు పాల్గొంటాయని వెల్లడించారు. స్టాల్స్ ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు నిర్వాహకులను సంప్రదించి ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఎక్స్‌పో కన్వీనర్ ఎం. రవిశంకర్, కో-కన్వీనర్ కె. బద్రి, ఏపీబీఎస్ఎస్ఎస్ అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ, కో-కన్వీనర్ ఎ. రమణమూర్తి, జీఎస్టీ అడ్వకేట్ సుందర రామశర్మ, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, హనుమప్రసాద్, రామకృష్ణ పరమహంస తదితరులు పాల్గొన్నారు.

## ప్రగడ కోటయ్య జయంతిని అధికారికంగా నిర్వహించడం చేనేతకు గౌరవం

- తెనాలి టీడీపీ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు జీవో జారీ చేయడాన్ని స్వాగతిస్తూ తెనాలిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన ఉద్యమ నాయకుడు ప్రగడ కోటయ్య అని కొనియాడారు. ఆయన కృషి ఫలితంగానే రాష్ట్రవ్యాప్తంగా చేనేత సహకార సంఘాలు బలోపేతం కావడంతో పాటు కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా చేనేత సంఘాలకు రుణ సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తులకు ఆప్కో ద్వారా మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటుచేయించడంలోనూ ఆయన విశేష కృషి చేశారని గుర్తు చేశారు.
చేనేత పితామహుడిగా పేరొందిన ప్రగడ కోటయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిన తెలుగుదేశం--జనసేన--బీజేపీ కూటమి ప్రభుత్వానికి రాష్ట్రంలోని చేనేత వర్గాలు కృతజ్ఞతలు తెలుపుతున్నాయని నాయకులు పేర్కొన్నారు.
కార్యక్రమంలో పద్మశాలి వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, తిరువీధుల సాంబశివరావు, దివి హేమంత్ కుమార్, అక్కల ప్రసాద్, గోలి శ్రీనివాసరావు, కాటూరి భాస్కర్, గట్టు బాల శ్రీనివాసరావు, గుర్రం లక్ష్మీనారాయణ, కాటం రవి, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, కే. శ్రీనివాసరావు, దివి సత్యం, జొన్నాదుల బాలాజీ, తాడిపర్తి గణపతి, గంజి నాగరాజు, మందూరి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# రైతు కళ్లలో కన్నీరు కాదు.. ఆనందం చూడాలన్నదే బీజేపీ లక్ష్యం

- వ్యవసాయంలో మార్పులకు సిద్ధం కావాలి
- యువ రైతులను ప్రోత్సహించాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్




**విజయవాడ, జూలై 26 (జర్నలిస్ట్ ఫైల్):** వాతావరణ మార్పులు, నీటి కొరత వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టిసారించాలని, యువతను వ్యవసాయ రంగంలోకి ఆకర్షించే చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం విజయవాడలోని ఐవీ ప్యాలెస్‌లో రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి కిసాన్ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి శంభు కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కిసాన్ మోర్చా ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు.
ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ దేశ రక్షణలో సైనికుల పాత్ర ఎంత కీలకమో, ఆహార భద్రతలో రైతుల పాత్ర అంతే ముఖ్యమని అన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం, నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని, దీనిపై త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వరి సాగును తగ్గించి తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు.
పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేసి ఆగస్టు 16 నాటికి అనకాపల్లి ప్రాంతానికి సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, రైతు సంక్షేమ పథకాలపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సంప్రదాయ, గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు వృక్ష ఆయుర్వేదంపై కూడా దృష్టి పెట్టాలని అన్నారు. వ్యవసాయ రంగంలో ఎరువులు, విత్తనాల ముడిసరుకు కోసం విదేశాలపై ఆధారపడుతున్న పరిస్థితిని అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు. యువత వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ప్రతి జిల్లాలో యువ రైతుల సదస్సులు నిర్వహించాలని సూచించారు. తోతాపురి మామిడి 2.14 లక్షల టన్నుల కొనుగోలుకు కేంద్రం అంగీకరించడం కిసాన్ మోర్చా సాధించిన విజయమని పేర్కొన్నారు. జీడి పరిశ్రమల సమీపంలో విలువ ఆధారిత ఆయిల్ తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు.
కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి మాట్లాడుతూ మిర్చి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మార్కెట్‌లో సరైన ధరలు లభించక రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. పంట మార్పిడికి అవసరమైన పరిస్థితులు, మౌలిక సదుపాయాలు రైతులకు అందుబాటులో లేవని అన్నారు. ప్రత్యామ్నాయ పంటలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని కోరారు.
కిసాన్ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి శంభు కుమార్ మాట్లాడుతూ రైతులకు, ప్రభుత్వానికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ బడ్జెట్ రూ. 24,500 కోట్లు ఉండగా, ఎన్డీఏ ప్రభుత్వంలో అది రూ. 1.37 లక్షల కోట్లకు పెరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు వ్యవసాయ రంగానికి రూ. 15 వేల కోట్ల నిధులు కేటాయించామని చెప్పారు.
గుంటూరు దేశంలోనే అతిపెద్ద మిర్చి ఆర్థిక కేంద్రంగా నిలిచిందని, వ్యవసాయమే భారత ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఆధారమని అన్నారు. రాష్ట్రంలోని 41 లక్షల మంది రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా నేరుగా ఆర్థిక సాయం అందించామని పేర్కొన్నారు. ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా వర్క్‌షాప్‌లు నిర్వహించామని తెలిపారు.
రైతులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందడం లేదని, మధ్యవర్తుల కారణంగా రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కళ్లలో కన్నీళ్లు కాకుండా ఆనందం కనిపించేలా కిసాన్ మోర్చా పనిచేస్తుందని చెప్పారు. ఆగస్టులో ఐదు వేల మంది యువ రైతులతో భారీ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో వ్యవసాయంపై ఆసక్తి తగ్గుతున్న పరిస్థితిని మార్చేందుకు యువతను వ్యవసాయ రంగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467